ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
మంగళవారం 05-05-2026 పేజీలు : 16

## గ్రామా అభివృద్ధి పనుల కొరకు
# మంత్రికి విన్నపం



చౌటకూర్ మే 04 (విజన్ ఆంధ్ర) : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాన్ను చౌటకూర్ మండలం పరిధిలోని బొమ్మరెడ్డిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్‌తో పాటు పాలకవర్గం, గ్రామస్తులు కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాన్ని మంత్రివర్యులకు అందజేశారు. మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి, బొమ్మరెడ్డిగూడెం గ్రామాన్ని అభివృద్ధి పరచే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్, ఉపసర్పంచ్ రజిని గోపాల్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు నాయక్, వార్డు సభ్యులు వడిత్య సుభాష్, నిలబాయి రాజు, మేనకా గణేష్, శారద బాబూలాల్, స్రవంతి గణపతి పాల్గొన్నారు. అదే సమయంలో విశ్రాంత బిహెచ్ఎల్ ఉద్యోగులు మూడ్ తారసింగ్, శంకర్ నాయక్, శివాజీ నాయక్, సంతోష్, ముదిరాజ్ సంఘం నాయకులు బొమ్మరాజు నర్సింహులు, ఆంజనేయులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మొగులయ్య, ప్రవీణ్, రవి లు కూడా పాల్గొన్నారు.

# మద్యం మాఫియా రాజ్యం

ఎక్సైజ్ శాఖ మౌనం వెనుక మిస్టరీ..!

- బెల్ట్ షాపులకు డైరెక్ట్ సరఫరా -- సిండికేట్ చేతుల్లో ధరల..
- నియంత్రణ... అధికారులపై గంభీర ఆరోపణలు..
- సిండికేట్ దందాకు ఎక్సైజ్ అండా..? ఆదేశాలు కాగితాలకే పరిమితం!.
- ఆదేశాలు ఫైళ్లలోనే... అమలు సిండికేట్ చేతుల్లో!
- బెల్ట్ షాపులకు ఓపెన్ సప్లై -- ప్రజల జేబుల దోపిడీ!
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ యంత్రాంగం



12 పేజీలో...

## కుత్బుల్లాపూర్‌లో కబ్జా 'పర్వం'..
# మళ్ళీ మొదలైన భూ దోపిడీ

- గాజుల రామారంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- కొత్త అధికారి రాకతో పెరిగిన 'చేతివాటం'..?
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం..హైడ్రా ఏమైంది?



3 పేజీలో...

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో
## – తాడిచెర్ల యువకుడు పెంట రఘు

మల్హార్, మే04 విజన్ ఆంధ్ర : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలంలోని తాడిచెర్ల గ్రామానికి చెందిన యువకుడు పెంట రఘు అరుదైన ఘనత సాధించాడు. గత నెల 26వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'లార్జెస్ట్ కరాటే డిస్ప్లే – కరాటే కాటా' ఈవెంట్‌లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను కైవసం చేసుకున్నాడు. దేశంలోని 21 రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది పాల్గొన్న ఈ పోటీల్లో, ప్రతిభ కనబరిచిన 1212 మందిని గిన్నిస్ రికార్డుకు ఎంపిక చేశారు. యూకే (ఇంగ్లాండ్) నుండి వచ్చిన ప్రతినిధుల బృందం ఈ ప్రదర్శనను ప్రత్యక్షంగా పర్యవేక్షించి రికార్డును ధృవీకరించినట్లు ఈవెంట్ ఆర్గనైజర్ ఎం. విటల్ జయంత్ రెడ్డి మాస్టర్ తెలిపారు. కోచ్ రాజు రాథోడ్ నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన రఘు, ప్రస్తుతం హైదరాబాద్‌లో లా కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. తమ గ్రామానికి చెందిన యువకుడు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించడం పట్ల తాడిచెర్ల గ్రామస్తులు, రఘు స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.



## నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం.



పరిగి, మే 04(విజన్ ఆంధ్ర ): నీటి పారుదల శాఖ అధికారులతో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని అయన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో సాగుతున్న నీటి పారుదల పనులు, చెరువుల అభివృద్ధి, కాలువల మరమ్మతులు, రైతులకు సాగునీటి అందుబాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, వర్షాకాలానికి ముందే అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, నీటి పారుదల రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రవికుమార్, ఈఈ రేణుక, డీఈఈలు పార్థసారధి, కృష్ణారెడ్డి, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

కుల్కచర్ల, మే 04 (విజన్ ఆంధ్ర): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ డీసీఎమ్మెస్ వైస్ చైర్మన్ భీరెండ్డి, కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య సూచించారు. మండల కేంద్రమైన కుల్కచర్లలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మి మోసపోరాదన్నారు. ప్రభుత్వం రైతుల కొరకు గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందుకే రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ లు రాంచెంద్రయ్య, ఎల్లయ్య, భరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మా భూమిని ఆక్రమించి మా కేసులు పెడతా అని బెదిరిస్తున్నారు

భూపాలపల్లి జిల్లా మే 05 ( విజన్ ఆంధ్ర ) వెలిశాల శివారు సర్వేనెంబర్ 159/1/1 లో 3 ఎకరాల.2900 గుంటల భూమిని నా కుమార్తెకు వారసత్వంగా వచ్చినది. ఇప్పుడు దళితులు ఒక ఎకరం మాది అంటూ మాపై దౌర్జన్యం చేస్తున్నారు.

నా పేరు కాసర్ల రాజా నరేందర్ రెడ్డి తండ్రి వెంకట్ (వయస్సు 68) రాజిరెడ్డి (లేటు) గ్రామము పగిడిపల్లి మండలం టేకుమట్ల జిల్లా జయశంకర్ భూపాలపల్లి. మాకు వారసత్వంగా తాత ముత్తాతల నుంచి వచ్చిన స్థిరాస్తి సర్వేనెంబర్ 189/1/1 లో 3 ఎకరాల 29 గుంటల భూమిని నా కూతురికి (కాసర్ల జ్యోతి భర్త శశిధర్ రెడ్డి) పెళ్లి సమయంలో మా అమ్మ పసుపు కుంకుమల కింద ఇచ్చినది. ప్రస్తుతం కాస్తు లోనే ఉన్నది. ఈ మధ్యకాలంలో దళితులు కొందరు నా కూతురికి ఇచ్చిన భూమిలో నుంచి ఒక ఎకరం భూమి మాదే అంటూ దౌర్జన్యంగా లాక్కొని వ్యవసాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మరియు ఇలా చేయడం తప్పు అని నేను ఎంత చెప్పినా వినకుండా ఈ భూమిలోకి నువ్వు వస్తే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరిస్తున్నారు. కావున నా వయసుని పరికలో తీసుకొని దయచేసి నా కూతురికి న్యాయం చేయవలసిందిగా మిమ్మల్ని ప్రార్థించుచున్నాను. మరియు వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. 2008 లో AD గారు వచ్చి కొలతలు పెట్టి హద్దులు కూడా నిర్ణయించినారు. ఇప్పటివరకు మూడుసార్లు ఫిర్యాదు చేసిన ఎటువంటి సమాధానం లేదు మమ్మల్ని మా కుటుంబాన్ని కాపాడవలసిందిగా వేడుకుంటున్నాను.

## ఘనంగా రైతు వారోత్సవాల కార్యక్రమం

జన్ ఆంధ్ర -- మే 4, అక్కన్నపేట : అక్కన్నపేట మండలం రామవరం రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత ఆధ్వర్యంలో రైతు వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మ కమిటీ చైర్మన్ జంగపల్లి ఐలయ్య గారు, వివిధ గ్రామాల సర్పంచ్లు హాజరయ్యారు.

వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల మరియు సిద్ధిపేట జిల్లా వ్యవసాయ శాఖల సహకారంతో, రానున్న వానాకాలం సాగుకు రైతులను సిద్ధం చేయడం లక్ష్యంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఎ. సరిత మాట్లాడుతూ వరి సన్న రకాలు ఖచీవీ-1638, ద్రూ-5204, ఔ+టా-44 సాగుకు అనుకూలమని తెలిపారు. అలాగే వివిధ పంటలలో సిఫారసు మేరకు యూరియా వినియోగం, అవసరానికి అనుగుణంగా రసాయనాల వినియోగం, నేల సంరక్షణ, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

తదుపరి జీటీఏ ఎస్. సురేందర్ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగునీటి ఆదా విధానాలు, ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి వివరించారు.

అనంతరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ. వీణా రెడ్డి మట్టి



నమూనాలు సేకరించే విధానం, మట్టి పరీక్షల ప్రయోజనాలపై వివరించారు. మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా మాట్లాడుతూ శాస్త్రవే త్తల సూచనలు పాటించడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ సర్పంచ్ శ్రీశైలం, ఇతర గ్రామాల సర్పంచులు వెంకటేష్, జాన్, శ్రీనివాస్, లక్ష్మి-సోమ, సునీత-రాజు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మరియు సుమారు 60 మంది రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## దౌల్తాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఇంటర్వ్యూలు

దౌల్తాబాద్, మే 4 (విజన్ ఆంధ్ర): ఎస్సీ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆన్లైన్ దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి అఫ్జలోద్దీన్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు దౌల్తాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో జరుగనున్నాయని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు తమ తమ గ్రామాల వారీగా సంబంధిత బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా దరఖాస్తుతో పాటు అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఇంటర్వ్యూకు గైర్హాజరైన వారికి తదుపరి అవకాశం ఉండకపోవచ్చని అందువల్ల ప్రతి అభ్యర్థి సమయానికి హాజరు కావాలని మండల అభివృద్ధి అధికారి స్పష్టం చేశారు.



## విద్యుత్ షాక్ తో పాడి ఆవు మృతి

కారేపల్లి,మే 04 (విజన్ ఆంధ్ర) గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు,ఈదురు గాలులకు విద్యుత్ షాక్ తో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని టేకులగూడెం గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది.వివరాల్లోకెళ్తే ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాలు,ఈదురు గాలులతో గ్రామాలు అతలాకుతలమయ్యాయి.చెట్లు విరిగిపడి పంట నష్టం సైతం వాటిల్లింది.ఈ క్రమంలో సోమవారం ఉదయం టేకులగూడెం గ్రామానికి చెందిన ముక్తి ప్రకాష్ తన పాడి ఆవు దూడను మేతకు తీసుకెళ్లే క్రమంలో వర్షానికి తడిసిన కరెంటు పోలుకు విద్యుత్ సరఫరా కావడంతో ఆవు ఆ కరెంటు స్తంభాన్ని తాగడంతో అక్కడికక్కడే మృతి చెందింది.విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ గుమ్మడి సందీప్వెంటనే స్పందించి విద్యుత్ శాఖ,వెటర్నరీ వైద్య అధికారులకు సమాచారం అందించారు.ఆవుకు పంచనామా చేసి ప్రభుత్వం నుండి రావలసినటువంటి సహాయాన్ని అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు.



## కొడంగల్ లో రైతు వారోత్సవల సందడి

కొడంగల్, మే 4 (విజన్ ఆంధ్ర ) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ సమతుల్య ఎరువుల యాజమాన్యం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో రైతు వేదిక లో సోమవారం కొడంగల్ మండలం వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత గ్రామ సర్పంచ్ ఎల్లప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన రైతు వారం కార్యక్రమంలో భాగంగా నేల ఆరోగ్యం యొక్క గొప్పతనం,భూమిలో ఉన్న పోషకాలు వాటి అవశ్యకత గురించి రైతులకు వివరించారు. మట్టి నమూనాలు ఎలా తీయలో డెమో స్టేషన్ ఏర్పాటు చేసి రైతులకు చూపించారు.పంట మార్పిడి తో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు.కార్యక్రమంలో శ్రీపతి రెడ్డి, ఫార్టిలైజర్ దుకాణ యజమానులు వెంకటయ్య మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.





## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి జంప్

**- కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం.**

**- మాజీ ఉమ్మడి జిల్లా కో ఆప్షన్ సభ్యుడు.**

**మొహమ్మద్ అజీమ్**

పరిగి, మే 04(విజన్ ఆంధ్ర): పరిగి నియోజకవర్గ పరిధిలోని పూడూరు మండలం చెంగోముల్ గ్రామానికి చెందిన మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మొహమ్మద్ అజీమ్ సోమవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మొహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నాయకత్వాన్ని బలపరచడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు అగ్రమాది శ్రీనివాస్ గుప్తా, రామస్వామి పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పరిగి, మే 04(విజన్ ఆంధ్ర ): పరిగి నియోజకవర్గ పరిధిలోని దోమ మండలం దాదాపూర్ గ్రామంలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ కృష్ణవేణి, డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాలలోనే వడ్లను విక్రయించాలని తెలిపారు. రైతులు తాలు, దుమ్ము లేకుండా తూర్పార బట్టిన వడ్లను మాత్రమే కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. ప్రభుత్వం మొదటి రకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389 సన్న రకానికి రూ. 2389, బోనస్ 500 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అవకతవకలు జరగకుండా చూసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు డీసీఎంఎస్ మేనేజర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి. శేఖర్, బసన్న గౌడ్, వెంకయ్య, ప్రకాష్ రెడ్డి, కృష్ణ, చిన్నయ్య, వెంకటయ్య, చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతోనే మెరుగైన దిగుబడులు

చేవెళ్ల,మే 04 (విజన్ ఆంధ్ర): భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే రైతుకు లాభదాయకమైన పంటలు సాధ్యమవుతాయని దేవర సమతావెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో చేపట్టిన రైతు వారోత్సవాల సందర్భంగా సోమవారం చేవెళ్ల మండలంలోని రైతు వేదికలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని, అందిన ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. సమగ్ర ఎరువుల నిర్వహణ పద్ధతులు అనుసరించడం ద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని వివరించారు. మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ మాట్లాడుతూ... నేల ఆరోగ్య పరిరక్షణకు సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల ప్రాముఖ్యతపై రైతులకు శాస్త్రీయ అవగాహన



కల్పించినట్లు తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల కార్డులను రైతులకు పంపిణీ చేస్తూ, వాటి ఆధారంగా పంటల సాగు విధానాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకోటేశ్వరరావు, రమ్య, ప్రతిభ, వరుణ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, మండలంలోని గ్రామాల సర్పంచులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు

**- ముత్యాలమ్మకు బోనాల సమర్పణ...**

కారేపల్లి,మే05 (విజన్ ఆంధ్ర) సింగరేణి మండల పరిధిలోని వెంకట్యతండా గ్రామంలో కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ దైవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్థులు మూడు రోజుల నుండి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ దేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

గ్రామంలో ఎంతో భక్తిశ్రద్ధలతో,నియమనిష్టలతో గత మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు దేవ దేవుళ్ళ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళం కంపెనీ ఎండి రాజేందర్,బెల్ కంపెనీ మేనేజర్ గుగులోతు రాజేందర్,బెల్ కంపెనీ ఎండి జి.రవి,మాజీ ఎంపీపీ బానోతు దేవ్లా నాయక్,సర్పంచ్ బానోతు బూలి,గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం,గ్రామ యువత సారధ్యంలో ఆర్థిక సాయంతో మొదటి రోజైన శుక్రవారం ఒకటో తారీకు నాడు గణపతి హోమం,రెండో తారీకు శనివారం రోజున విగ్రహాల ఊరేగింపు హోమ కార్యక్రమం,మూడో తారీకు ఆదివారం నాడు విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ ప్రతిష్ట నూతన



వాయు శివలింగం,పంచలోహ విగ్రహాల శంకుస్థాపనలు,సీతారాముల కళ్యాణం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ముగింపు రోజు సందర్భంగా గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ బోనాల సమర్పణతో ఈ ఆలయ ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి కమిషనర్‌గా తన్నీరు రమేష్

బెల్లంపల్లి మే 4 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్ రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో తన్నీరు రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ పరిపాలనలో మార్పుల భాగంగా ఈ బదిలీ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న తన్నీరు రమేష్ పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకోనున్నారు.



# కుత్బుల్లాపూర్‌లో కబ్జా 'పర్వం'.. మళ్ళీ మొదలైన భూ దోపిడీ!

కుత్బుల్లాపూర్, మే 4 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ శివారు ప్రాంతమైన కుత్బుల్లాపూర్ మండలంలో ప్రభుత్వ భూములపై మళ్ళీ కబ్జాదారుల కన్ను పడింది. ఇన్నాళ్లూ వేచి చూసే ధోరణి అవలంబించిన భూ బకాసురులు, ఇప్పుడు అనుకూల పరిస్థితులు రావడంతో రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా గాజుల రామారం పరిధిలోని సర్వే నంబర్లు 307, 329, 342 లలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

అధికారి రాక.. అక్రమాలకు ఊతం?

గతంలో కుత్బుల్లాపూర్ మండలంలో ఆర్ఐ (=×)గా పనిచేసిన సుధాకర్, ఇటీవల డిప్యూటీ తహసీల్దార్‌గా (ఖ) పదోన్నతి పొంది, ఇంచార్జ్ ఎంఆర్ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన కేవలం వారం, పది రోజుల వ్యవధిలోనే పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలియడం గమనార్హం. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కిందిస్థాయి అధికారులు జోక్యం చేసుకోకూడదని, అటువైపు కన్నెత్తి చూడవద్దని ఆయన హుకుం జారీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది." ఇది భారీ భూ కుంభకోణానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

?నాడు కూల్చివేతలు.. నేడు మౌనం ఎందుకు?




కూల్చివేసిన హైడ్రా (న్ణ=ూా) అధికారులు, ఇప్పుడు యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు ఎందుకు వదిలేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గూగుల్ మ్యాప్స్ ఆధారంగా గతానికి, ఇప్పటికి జరిగిన మార్పులను గమనిస్తే ఆక్రమణలు ఎంత వేగంగా జరుగుతున్నాయో స్పష్టమవుతుంది. పేదలపై ప్రతాపం చూపిన అధికారులు, బడా కబ్జాదారుల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- గాజుల రామారంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు**

**- కొత్త అధికారి రాకతో పెరిగిన 'చేతివాటం'..?**

**- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం..**

**హైడ్రా ఏమైంది?**

విచారణ జరపాలి: కలెక్టర్‌కు విజ్ఞప్తి

సర్కార్ భూములను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులే కబ్జాదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ (=ఖా) తక్షణమే విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని విన్నవిస్తున్నారు.

?అధికారి వివరణ: ఈ వ్యవహారంపై డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌ను వివరణ కోరగా.. "అక్రమ నిర్మాణాల విషయం ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. వెంటనే క్షేత్రస్థాయి అధికారులను పంపించి పరిశీలిస్తాం. అక్రమ నిర్మాణాలు ఏవైనా ఉంటే తక్షణమే కూల్చివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

# కమీషనర్ సాబ్ జర దేఖో సాబ్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మే 05 (విజన్ ఆంధ్ర ) జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ కు సమీపంలో ఫుత్ పాత్ పబ్లిక్ స్థలం లో ప్రైవేట్ కార్పొరేట్ వ్యాపార సముదయానికి సంబందించిన ట్రాన్స్ ఫారం బిగించుకోవడం జరిగింది. గతంలో ఇక్కడ ఒక పెద్ద ఆక్సిడెంట్ జరిగి ఒకరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. అనేక సార్లు మున్సిపల్ కమీషనర్ మరియు అధికారులకు తొలగించాలని వినతి పత్రాలు సమర్పించిన స్పందన కరువైయిపోయింది. మున్సిపల్ పరిధిలో ప్రజలు తమ ఇంటినిర్మాణం కోసం ఇటుకలు, ఇసుక రోడ్డు అనుకోని పోస్తే మాత్రం కమీషనర్, అధికారులకు కనిపిస్తుంది కానీ ఇలాంటివి కనబడదు అని ప్రజలు అనుకుంటాండ్లు భాద్యత మరిచిపోయి ఈ కార్పొరేట్ షాపింగ్ మాల్ మాత్రం కనపడవు మధ్య తరగతి ప్రజలు ఇండ్లు కట్టుకుంటే మాత్రం రూల్స్ అడ్డువస్తాయని ప్రజలు అనుకుంటున్నారు.

## సేంద్రియ సాగుకు ప్రోత్సాహం... వ్యవసాయ వారోత్సవాలు



బెల్లంపల్లి మే 4 విజన్ ఆంధ్ర : ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, వన శాఖల ఆధ్వర్యంలో సోమవారం బెల్లంపల్లి మండలంలోని కన్నాల రైతు వేదికలో వ్యవసాయ వారోత్సవాలు ఏడీఏ రాజానరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై వివరాలు తెలియజేశారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని, నేల ఆరోగ్యం కాపాడటం అత్యవసరమని అధికారులు సూచించారు. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సరైన ఎరువుల వినియోగం సాధ్యమవుతుందని తెలిపారు. ఏఈఓ తిరుపతి మట్టి నమూనాల సేకరణ విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ రైతులకు అవగాహన కల్పించారు

# శాస్త్రీయ సాగుతోనే రైతుకు లాభం: అధికారుల సూచనలు

బెల్లంపల్లి మే 4 విజన్ ఆంధ్ర : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కాసిపేట మండలంలోని ముత్యంపల్లి, ధర్మారావుపేట రైతు వేదికల్లో సోమవారం రైతు వారోత్సవ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించారు. భూమి సారాన్ని కాపాడుకోవాలంటే ప్రతి 2--3 సంవత్సరాలకు ఒకసారి నేల పరీక్షలు చేయించుకోవాలని, సాయిల్ హెల్త్ కార్డ్ ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను సమతులంగా వినియోగించాలని సూచించారు. పచ్చి ఎరువుల వినియోగం, పంట అవశేషాల నిర్వహణ, నేలలో జీవ పదార్థాల పెంపు, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు.

అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల నేల నాణ్యత తగ్గడంతో పాటు ఖర్చులు పెరుగుతాయని, కాబట్టి సమతుల మోతాదులోనే ఎరువులు వినియోగించాలని తెలిపారు. సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతను కూడా రైతులకు వివరించారు.

నాణ్యమైన విత్తనాల ఎంపిక మంచి దిగుబడికి కీలకమని, సర్టిఫైడ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో



తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సిఫారసు చేసిన సన్న రకం వరి రకాలను సాగు చేయాలని, దొడ్డు రకాలను నివారించాలని తెలిపారు. యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, సర్పంచులు జుగునాక రాధ, మాడావి వెంకటేష్, పెంద్రం శంకర్, ఆత్రం కళావతి, పేరం మల్లేష్, కోట్నాక రఘుపతి, బదావత్ నీలా, నవందుల పుష్పలత, ఉప సర్పంచులు గోపు శ్రీనివాస్, జంజీరాల సందీప్, బూరుగుపల్లి రమేష్, ఎం.సందీప్, సూరం కిషన్, ఏఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ ఆలయానికి పంచలోహ విగ్రహాల బహుకరణ

**- రూ.1,07,116 విలువ చేసే పంచలోహ విగ్రహాలను బహూకరించిన గుగులోతు రవి(బెల్ రవి) దంపతులు**

కారేపల్లి,మే05(విజన్ ఆంధ్ర) : సింగరేణి మండల పరిధిలోని వెంకట్యతండా గ్రామంలో కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయానికి,భల్లునగర్ తండా గ్రామానికి చెందిన గుగులోత్ రవి దంపతులు రూ.1,07, 116 రూపాయలు విలువ చేసే సీతారామ,లక్ష్మణ,ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహాలను వితరణగా అందజేశారు. దైవ కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్థులు మూడు రోజుల నుండి ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ ఉత్సవాల్లో భాగంగా పంచలోహాల విగ్రహాల దాత గుగులోత్ రవి (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మేనేజర్) దంపతులు స్వామివారి కల్యాణం,ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పగా ఘనంగా నిర్వహించిన దైవ కార్యక్రమంలో భాగస్వాములు అయినందుకు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్ మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించిన



దైవ కార్యక్రమాల ద్వారా వెంకట్యతండా గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో,పాడిపంటలతో వర్ధిల్లాలని శ్రీఅభయాంజనేయస్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో పాటు,గ్రామస్తుల సహకారం,యువత భాగస్వామ్యం ద్వారా ఈ దైవ కార్యక్రమం గొప్పగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ బుల్లి,మంగళం కంపెనీ ఎండీ గుగులోతు రాజేందర్,మాజీ సర్పంచులు, వెంకట్యతండా గ్రామస్తులు,ఉద్యోగస్తులు,యువత తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మున్సిపాలిటీలో 'అవినీతి' సామ్రాజ్యం

**- సాబీర్ అలీ పాలనలో అక్రమాల పర్వం!**

**- నిబంధనలు గాలికి.. అర్ధరాత్రి బిల్లుల దందా?**

**- విజిలెన్స్ రిపోర్టును తొక్కిపెట్టింది ఎవరు?**

నిజాంపేట్, మే 4 (విజన్ ఆంధ్ర) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారిందా? నిబంధనల అమలులో కఠినంగా ఉండాల్సిన డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, విమర్శలకు నిలయంగా మారిందా? అంటే అవుననే అంటున్నారు సామాజిక కార్యకర్త ఆకుల సతీష్. గత రెండేళ్లుగా డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ నాయకత్వంలో జరుగుతున్న పరిణామాలు మున్సిపల్ చట్టాలను అపహాస్యం చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

చీకటి ఒప్పందాలు.. అర్ధరాత్రి సంతకాలు!

నిజాంపేట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, మున్సిపల్ కార్యాలయం అర్ధరాత్రి వేళల్లో సైతం వెలుగులు జిమ్మడం వెనుక ఉన్న 'చీకటి ఒప్పందాల'పై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది... ?మిస్టరీ పేమెంట్స్: 2025 నవంబర్ 27 నుండి డిసెంబర్ 2 మధ్య, సాధారణ పని గంటలు ముగిసిన తర్వాత కూడా ఆఫీసులో ఉండి బిల్లులు క్లియర్ చేయడం వెనుక ఆంతర్యమేమిటి?..?విజిలెన్స్ నిశ్శబ్దం: విచారణ జరిగి



నాలుగు నెలలు గడుస్తున్నా, నివేదిక వెలుగు చూడకపోవడం వెనుక ఉన్న 'అదృశ్య హస్తం' ఎవరిది? రిపోర్టును తొక్కిపెట్టి ఎవరిని కాపాడాలని చూస్తున్నారు?

– డంపింగ్ యార్డ్ ముసుగులో రూ. 3 కోట్ల గోల్‌మాల్?

?చెత్త నిర్వహణ పేరుతో సాగుతున్న దోపిడీ అక్షరాలా రూ. 3 కోట్లకు చేరిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు విచారణ కొనసాగుతుండగానే, అదే కాంట్రాక్టుకు నిధులు విడుదల చేయడం అధికారుల సాహసమా లేక 'కమీషన్ల' కక్కుర్తా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు...?కబ్జాల పర్వం: ప్రభుత్వ భూములు, పార్కులు ఆక్రమణకు గురవుతున్నా, అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా డిప్యూటీ కమిషనర్ మౌనం వహించడం వెనుక భారీ ఆర్థిక లావాదేవీలు ఉన్నాయనే అనుమానాలను సతీష్ వ్యక్తం చేశారు.

వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందే!

?సైబరాబాద్ ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదులో ఆకుల సతీష్ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు మున్సిపల్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.?"ఒక అధికారిపై ఇన్ని ఆరోపణలు ఉన్నా, విజిలెన్స్ విచారణ జరుగుతున్నా.. ఇంకా అదే కుర్చీలో కొనసాగించడం విచారణను ప్రభావితం చేయడమే అవుతుందన్నారు. సాబీర్ అలీని తక్షణమే బదిలీ చేసి, నిజాంపేట్ కార్పొరేషన్ నిధులకు రక్షణ కల్పించాలి అని" సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కొన్ని డిమాండ్లు చేశారు. ?ఫోరెన్సిక్ ఆడిట్: గత రెండేళ్లలో జరిగిన ప్రతి ఇంజనీరింగ్ పనిపై, ప్రతి పైసా ఖర్చుపై స్పెషల్ ఆడిట్ జరపాలన్నారు. కేవలం బదిలీతో సరిపెట్టకుండా, విజిలెన్స్ నివేదిక ఆధారంగా బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి అన్నారు. అంతేకాకుండా అవినీతికి పాల్పడి ఆర్జించిన నిధులను రికవరీ చేయాలని తెలిపారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే, నిజాంపేట్ ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సతీష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాండు, కృష్ణారెడ్డి, సింహపురి కాలనీ వాసులు పాల్గొని తమ నిరసనను గట్టిగా వినిపించారు.

## హిడెన్ క్యాస్టిల్ ముందు ధర్నా చేసిన బీజేపీ శ్రేణులు..

కుకునూరుపల్లి, మే 04,విజన్ ఆంధ్ర : కుకునూరుపల్లి మండలం మాత్ పల్లిలోని హిడెన్ క్యాస్టిల్ రిసార్ట్‌లో మతపరమైన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి స్టాండప్ కమెడియన్ మునవర్ ఫారుఖీ హాజరవుతున్నారన్న సమాచారంతో సోమవారం బీజేపీ కుకునూరు పల్లి మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు అడ్డుకొని, పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సంపత్ రెడ్డి మాట్లాడుతూ శాంతియుత నిరసన చేస్తున్న తమని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు నందమూరి కిషోర్ శర్మ, కొండపాక మండల పార్టీ అధ్యక్షులు నీలసత్యం పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

## శ్రీ కాళేశ్వర దేవస్థానం పాలకమండలి మొదటి సమావేశం..!



మహాదేవపూర్ మే 04 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూరం మండల్ కాళేశ్వరం గ్రామంలో మే 21న జరగనున్న సరస్వతి అంత పుష్కరాలకు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి మొదటి సమావేశం నిర్వహించడం జరిగింది ఈవో ఎస్ మహేష్ ఆధ్వర్యంలో చైర్మన్ మోహన్ శర్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాలకమండలి మొదటి సమావేశంలో 21.05.2026 నుండి 01.06.2026 వరకు జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులకు సౌకర్యాల గురించి చర్చించి తీర్మానించడం జరిగినది. భక్తులు సేద తీలేందుకు చలవ పందిరిలో త్రాగునీరు వస్త్రాలు మార్చుకునే గదులు మలుగుదొడ్లు దైవదర్శనానికి వెళ్లే క్యూ లైన్లు విఐపి లకు దర్శనానికి వెళ్లే క్యూ లైన్లు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చర్చించుకున్నారు ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## కాళేశ్వరఆలయాన్ని దర్శించుకున్న టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్..!

మహాదేవపూర్ మే 04 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపురం మండలం కాళేశ్వరం లోని దక్షణ కాశిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని సోమవారం రోజున టీపీసీసీ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్న మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ముందుగా వారికి రాజగోపురం వద్ద నుండి ఆలయ సాంప్రదాయాలతో మర్యాదపూర్వక స్వాగతం పలికి అనంతరం స్వామివారికి రుద్రఅభిషేకం నిర్వహించి శ్రీ శుభనంద అమ్మవారి దర్శనం అనంతరం ఆలయంలో ఆలయ చైర్మన్ మోహన్ శర్మ స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించిన అనంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా డిసిసి ప్రెసిడెంట్ కరుణాకర్ ఆలయ ఈవో ఎస్ మహేష్ గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి ఆలయ ధర్మకర్తలు పాల్గొనడం జరిగినది.



# ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

మంగపేట మే 04 (విజన్ ఆంధ్ర) : మంగపేట మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బోనుగు చంద్రమోహన్ రాణి దంపతుల నూతన గృహప్రవేశం కు హాజరై కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కుమారుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ నియోజకవర్గం యువ నాయకుడు కుంజా సూర్య ఈ సందర్భంగా అయన కు శాలువా తో సత్కరించారు

లిఅదేవిధంగాలి

రాజుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల ముఖర్జీ సతీమణి ధనలక్ష్మి ఇటీవల కాలంలో స్వర్గస్థులు అవ్వగా సోమవారం ఆమె వర్ధంతి సందర్భంగా వారి నివాసం వద్ద కు వెళ్లి ఆమె చిత్ర పఠనికి వారి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు

అదేవిధంగా



రాజుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద గతంలో కట్టిన నిర్మాణం పనులు పూర్తి కానందున పూర్తి గా పరిశీలన చేసి పాఠశాల కు కాంపౌండ్ నిర్మాణం లేనందున మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి మంజూరు అయ్యే విదంగా కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వల్లేపల్లి శివ ప్రసాద్ తోట రమేష్ అయ్యోరి యాణయ్య ముటుకుంట్ల నరేందర్ కోడెం బాలకృష్ణ జగన్ మోహన్ రెడ్డి బడిశా ఆదినారాయణ మండల మీడియా ఇంచార్జి భూక్యా కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం

### మండల యూత్ అధ్యక్షులు బడిశా ఆదినారాయణ

మంగపేట, మే 04(విజన్ ఆంధ్ర) : మండలంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులుగా బడిశా ఆదినారాయణ నియామకాంపై శుక్రవారం మీడియాతో ఆదినారాయణ మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క ఆశీస్సులు మార్గదర్శకత్వంతో మంగపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బడిశా ఆదినారాయణ నాకు ఇచ్చిన ఈ గొప్ప బాధ్యతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ అవకాశాన్ని కల్పించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ రాష్ట్ర యువ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కుంజా సూర్య కి ములుగు జిల్లా యువ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ కి ములుగు అసెంబ్లీ ప్రెసిడెంట్ మారం సుమన్ రెడ్డి కి మైల జయరాం రెడ్డి గుమ్మడి సోమయ్య కు ప్రత్యేక ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే నాపై విశ్వాసం ఉంచి కాంగ్రెస్ పార్టీలో యువతకు మంచి అవకాశాన్ని ఇచ్చిన మంగపేట సీనియర్ మండల కమిటీ సభ్యులందరికీ నాతోటి యూత్ కాంగ్రెస్ మిత్రులకునా కృతజ్ఞతలు.

చిన్న వయసు నుంచే నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడానికి నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. నాకు అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ, యువతకు ఆదర్శంగా నిలిచి, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తాను అని మండల యూత్ అధ్యక్షులు బడిశా ఆదినారాయణ అన్నారు.



# ఐ ఎన్ టి యు సి మిత్రపక్షాల ఆధ్వర్యంలో టి పి మ్ ని బహిష్కరించిన కార్మికులు

**- పరిశ్రమలో రెండుసార్లు కూడా టీపీఎం ను బహిష్కరించింది ఐ ఎన్ టి యు సి మాత్రమే**

**- ఏప్రిల్ 30 న రిటైర్ అయిన కార్మికులకు కూడా 12 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటించాలని డిమాండ్**

బూర్గంపాడు మండల ప్రతినిధి మే 3 (విజన్ ఆంధ్ర) : ఐటీసీ భద్రాచలం పేపర్ బోర్డ్స్ యూనిట్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకై INTUC మిత్రపక్షాలలి ఆధ్వర్యంలో టిపిఎం మరియు సురక్ష ను బహిష్కరణకు పిలుపునిచ్చారు ఒప్పందం ముగిసి 34రోజులు గడుస్తున్నా, యాజమాన్యం నుండి సరైన స్పందన లేకపోవడంతో కార్మిక లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలో, మే 4 సోమవారం నుండి టిపిఎం సురక్షాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు ఐటీసీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ముందు ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ మిత్రపక్షాలు ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా INTUC మిత్రపక్షాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ గోనే రామారావు. శ్రీ యారం పిచ్చి రెడ్డి మాట్లాడుతూ..

కార్మికుల కష్టార్జితంతో లాభాలు గడిస్తున్న యాజమాన్యం, వారి కనీస అవసరాలను గుర్తించకపోవడం శోచనీయం. మా డిమాండ్లు నెరవేరే వరకు ఈ పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. ఏప్రిల్ నెల లో కొత్త వేతనంతో కూడిన జీతాలు రేపు ఐదో తారీకు ఇవ్వవలసి ఉ ండగా ఇప్పటివరకు యాజమాన్యం అటు గుర్తింపు సంఘం ఎటువంటిది స్పష్టత ఇవ్వకపోవడంతో కార్మిక లోకం అయోమయంలో ఉందన్నారు కాబట్టి టీపీఎం ను బహిష్కరిస్తూ కఠినమైన నిర్ణయాన్ని తీసుకున్నట్టు ప్రకటించారు అలాగే మరి నిన్న 30వ తారీకు రిటైర్ అయిన కార్మికులకు కూడా కొత్త రిటర్మెంట్ బెనిఫిట్ 12 లక్షలు కూడా ఇప్పించాలని వారి డిమాండ్ చేశారు పరిశ్రమ చరిత్రలో టి పి యం ను బహిష్కరించిన ఘనత ఒక్క ఐ ఎన్ టి యు సి మిత్రపక్షాలకే ఉందని కాబట్టి రెండోసారి కూడా ఈ 14వ వేతన ఒప్పందాన్ని నిరసిస్తూ టిపిఎం ను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మ్యాన్ పవర్ తగ్గించి పని భారాన్ని పెంచాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు ఇవ్వటికైనా యాజమాన్యం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఈ సందర్భంగా గుర్తింపు సంఘానికి కూడా హెచ్చరిస్తున్నాం వేతన ఒప్పందంపై ఎన్నో ఆశలతో ఉన్న కార్మికులను ఇంకా మోసగించకండి. గతంలో అపోజిషన్గా ఉండి ప్యాకేజ్ సాధనకై గొంతెత్తి అరిసిన సందర్భాలను గుర్తు చేసుకోండి! అర్ధనగ్న ప్రదర్శనలతో ఒక్క మాన్ పవర్ కూడా తీయకూడదన్న కార్మికుల ఆవేదన అర్థం చేసుకోండి! నూతన కోటర్స్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయండి! రిటైర్డ్, వైద్యం, విద్య, బదిలీ కార్మికుల పర్మనెంట్, శ్రీరామనవమికి పేయిడ్ హాలిడే, జాబ్ క్యాలెండర్, డిపార్ట్మెంట్ గ్రేడ్లకై వేచి ఉన్న, తపిస్తున్న కార్మికులను । దృష్టిలో పెట్టుకొని 22,000/- తగ్గకుండా వేతన ఒప్పందం పూర్తి చేయండి. అలాగే పరిశ్రమ 50 సం॥రాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతి కార్మికునికి పది గ్రాముల గోల్డ్ కాయిన్ బహుమతిగా ఇప్పించండి. మీకు ప్రతికూల పరిస్థితులు ఉంటే రండి కార్మికుల్లో కలవండి కార్మికులను న్యాయం చేసే భాగంలో మాతో కలవండి మీకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి మిత్రపక్షాల ఆఫీస్ బేరర్స్ నాయకులు కార్యకర్తలు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



ఏన్కూరు, మే 4(విజన్ ఆంధ్ర): ఏన్కూరులో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు మంకెన కృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీకి వినతి పత్రం అందజేశారు. అరకొర నీటి సరఫరాతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేసవి తీవ్రత దృష్ట్యా త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని మంకెన కృష్ణ కోరారు. గత వారం రోజుల నుంచి ఈ సమస్య నెలకొన్నదని తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

## హుమ్నపూర్ గ్రామానికి నూతన సెక్రటరీగా మల్లేశం బాధ్యతలు స్వీకారం



జహీరాబాద్ మే 04 (విజన్ఆంధ్ర) : న్యాల్కల్ మండలం హుమ్నపూర్ గ్రామానికి నూతన సెక్రటరీగా మల్లేశం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ సెక్రటరీ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు సంతోష్, ప్రకాష్, షరీఫ్, రాజు, చందు తదితరులు మల్లేశంను పూలమాలలతో సన్మానించి హృదయపూర్వక స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహణ

## - మట్టి ఆరోగ్యంపై అవగాహన -- రైతులకు సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ

కోహెడ విజన్ ఆంధ్ర మే 4: కోహెడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ రోజు "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారి సతీష్,కోహెడ గ్రామ సర్పంచ్ బందెల సుజాత ముఖ్యఅతిథులుగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు మట్టి ఆరోగ్య నిర్వహణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మట్టి పరీక్షలు చేయించుకొని,అందిన నివేదికల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా పంట దిగుబడి మరియు నాణ్యత పెరుగుతుందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల మట్టి నాణ్యత తగ్గుతుందని,సమతుల్య ఎరువుల వినియోగం సేంద్రీయ పద్ధతులు అనుసరించాలని సూచించారు. అలాగే,రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సాయిల్ హెల్త్ కార్డుల ప్రాముఖ్యతను వివరించి,కార్యక్రమంలో వాటిని పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా భూమిలోని పోషకాల స్థితి తెలుసుకొని,శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతుల సమస్యలు,పంటల పరిస్థితి,ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించగా,రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిశ్రీధర్ రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు

## - బాధితురాలికి రూ.2 లక్షల పరిహారం



బెల్లంపల్లి, మే 4 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంచిర్యాల ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. అదనంగా రూ.10,000 జరిమానా విధించగా, బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ను ఆదేశించింది.

బెల్లంపల్లి 1టౌన్ పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం

బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంప్‌కు చెందిన బంద సాయికృష్ణ (44)పై 2020 అక్టోబర్ 21న కేసు నమోదైంది. ఆడుకోవడానికి వెళ్లిన బాలికపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ బి రాజు కేసు నమోదు చేసారు, ఏసీపీ రహేమాన్ దర్యాప్తు చేసారు విచారణ అనంతరం నిందితుడిపై ఆరోపణలు రుజువుకావడంతో న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస నాయక్ కఠిన శిక్ష విధించారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డా. ఎ. రాంభావ్ 19 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించారు. డీసీపీ ఏగ్గడి భాస్కర్, ఏసీపీ వి.కిరణ్ కుమార్ పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్ రావు, కోర్టు సీడీఓ ఎల్. సరోజ, లైజన్ అధికారులు ఎన్. గోవింద్ రావు, చుంచు వెంకటేశ్వర్లు లను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ (డీఐజీ) అభినందించినట్లు పేర్కొన్నారు.

## సంబురాలు చేసుకున్న బీజేపీ నాయకులు



లికుకునూరుపల్లి,మే 04,విజన్ ఆంధ్ర :లి పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో సోమవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు బాలసంచ పేల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు హాజరయ్యారు

# అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

## - బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 4 : సోమవారం రోజున సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించి, రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ గత పదిహేను రోజులుగా మార్కెట్ యార్డులో రైతులు వడ్లు పోసి ఎండలో నిరీక్షిస్తున్నారని, ప్రభుత్వం కోనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని, నిన్న కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కోనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ పట్టణ శాఖ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంట సకాలంలో అమ్ముకోవడానికి ఇన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కోనుగోలు చేయడానికి ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తుందో, రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారల నిర్లక్ష్యం మూలంగా రైతులు వడ్ల కుప్పల దగ్గర



ఎండలో నిరీక్షిస్తూ, వడదెబ్బకు గురవుతున్నారని తెలిపారు. తాలు, తరగు పేరుతో ప్రభుత్వం రైతుల వద్ద ఐదు నుంచి ఆరు కిలోల వడ్లు తక్కువ చేసి కోనుగోలు చేయడం దారుణమని అన్నారు. అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన, వడ్లు కోనుగోలు ప్రక్రియలో వేగవంతం చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ, చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. నెల రోజులుగా మార్కెట్ యార్డులో మొక్కజొన్నలు తీసుకువచ్చి, వెచ్చిస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా గన్ని బ్యాగుల లేవని సాకులు చెబుతూ, రైతులను అరిగోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా గన్ని బ్యాగులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వెంటనే మార్కెట్ యార్డులో వడ్లు, మక్కలు కోనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి ఇలాకాలో రైతుల పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉంటే మంత్రి పొన్నం ప్రభాకర్ ఏమీ సమీక్ష నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రైతుల పట్ల పొన్నం ప్రభాకర్ నిర్లక్ష్యం, మొండి వైఖరిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, కార్యదర్శులు బొప్పిశెట్టి సాయిరామ్, అకోజు అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు కాయిత అరుణ్ రెడ్డి, బొనగిరి రవి, తోట సమ్మయ్య, వరియోగుల అనంతస్వామి, పోలోజు రవీందర్,అశాడపు శ్రీనివాస్, నాయకులు అబ్బిడి లింగారెడ్డి, వెల్దాండి వెంకటరమణ, సుంకరి రాజేష్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



# సిర్గాపూర్‌లో రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

సిర్గాపూర్ విజన్ ఆంధ్ర మే 4 : ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలు సోమవారం సిర్గాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు నేల ఆరోగ్యాన్ని తెలుసుకుని పంటలను సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు.అదేవిధంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఈఓలు, సిర్గాపూర్ క్లస్టర్‌కు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్ద శంకరంపేట్‌లో రైతు వారోత్సవాలు



పెద్ద శంకరంపేట్: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్ మండలంలో రైతు వారోత్సవాలు నాలుగో తారీఖు నుంచి 9వ తారీఖు వరకు కొనసాగుతాయి ఈరోజు రైతు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మూడు క్లస్టర్లు శంకరంపేట్ శివాయిపల్లి రామోజీ పల్లి లలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది రైతులు తప్పకుండా తమ భూములలో మట్టి నమూనాలు సేకరించి మట్టి పరీక్ష చేయించుకోవాలి రైతులకు సమతుల్య ఎరువుల యజమాన్యంపై క్లుప్తంగా వివరించడం జరిగింది అదేవిధంగా రైతులు ప్రతిఏటా ఒకే పంట కాకుండా పంట మార్పిడి విధానం భూమిలో లగు శాతం పొందడమే కాక అధిక దిగుబడులు పొందవచ్చు అని వివరించడం జరిగింది మిశ్రమ పంటల ద్వారా ఒకేసారి రెండు పంటల ఆదాయం పొందవచ్చు వరి పంటలో సన్న రకాలైన మేలైన వరి వంగడాలని ఎంచుకొని సులభంగా కొనుగోలు చేసుకోవచ్చని వివరించడం జరిగింది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లీ పురుగుమందుల అవశేషాలు లేకుండా పంట ఉత్పత్తులు చేసుకొని అధిక దిగుబడి పొందవచ్చని వివరించడం జరిగింది విత్తన శుద్ధి ద్వారా ఆది నుంచి పురుగులు మరియు రోగాల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని డెమో చూపించడం జరిగింది మట్టి నమూనాలు తీయు పద్ధతిని డెమో ద్వారా క్లుప్తంగా రైతులకు వివరించడం జరిగింది రైతు నమోదు పై అవగాహన చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో తహసీల్దార్ ప్రభుదాస్, మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ విస్తీర్ణ అధికారులు వినీత్ కుమార్, శివాయపల్లి రామోజీ క్లస్టర్ ఏఈవోలుఅఖిల్,సుభాష్,వివిధ గ్రామాల సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలి

భూపాలపల్లి జిల్లా 04 మే ( విజన్ ఆంధ్ర ) కేంద్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.

సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ గారు మాట్లాడుతూ, బీసీ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అతి త్వరలో గ్రామ మరియు మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని కుల సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు కమిటీ ఎన్నికలకు సహకరించి వాటిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన స్పష్టంచేసారు భూపాలపల్లి పట్టణంలో కోతుల సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. కోతులను పట్టణం నుండి అడవులకు తరలించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని



తెలిపారు. ఈ ఉద్యమానికి పట్టణంలోని ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా జేఏసీ కో-కన్వీనర్లు మహేందర్ పద్మశాలి, దేవునూరి చంద్రమౌళి (సగర ఉప్పర), అమృత అశోక్ కురుమ, రవీందర్ మాదిగ, పిక్కల్ల సారయ్య కురుమ, జోగుల సమ్మయ్య, అలాగే జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ కొత్తూరు రవీందర్ పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న చేను కాలిపోయిన

# రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

### - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి జిల్లా మే 05 (విజన్ ఆంధ్ర ) : చిట్యాల మండలం తిరుమలపురం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న పంట చేను కాలిపోవడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సంఘటన స్థలానికి చేరుకుని పంటచేను పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పెట్టుబడి పెట్టి కష్టపడి పండించిన పంట కోత దశకు చేరుకున్న సమయంలో ఇలాంటి ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం అన్నారు. ముఖ్యంగా ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలన ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ ఘటనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో మాట్లాడి బాధిత రైతులకు తగిన నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ద్వారా కూడా వీలైనంత సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎమ్మార్వో,ఎంపీడీవో,వ్యవసాయ శాఖ అధికారులు,ఎలక్ట్రిసిటీ అధికారులు, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి గుమ్మడి శ్రీదేవి కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# వడ్ల కోనుగోలులో ప్రభుత్వ జాప్యం ఎండకు నెరివడుతున్న రైతులు

### - అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కోనుగోలు చేయాలి

### - బీజేపీ అక్కన్నపేట శాఖ డిమాండ్

విజన్ ఆంధ్ర మే 4 అక్కన్నపేట : కోనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లను పరిశీలించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న బీజేపీ అక్కన్నపేట మండల శాఖ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి

ఈ రోజు హుస్నాబాద్ నియోజకవర్గంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని బీజేపీ అక్కన్నపేట మండల బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించి, రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గత పదిహేను రోజులుగా హాయ్ కేపీ కేంద్రాలలో రైతులు వడ్లు పోసి ఎండలో నిరీక్షిస్తున్నారని, ప్రభుత్వం కోనుగోలు ప్రక్రియ వేగవంతం చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని, నిన్న కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కోనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ అక్కన్నపేట మండలశాఖ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి రైతు పండించిన పంట సకాలంలో అమ్ముకోవడానికి ఇన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కోనుగోలు చేయడానికి ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తుందో, రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారల నిర్లక్ష్యం మూలంగా రైతులు వడ్ల కుప్పల దగ్గర ఎండలో నిరీక్షిస్తూ, వడదెబ్బకు గురవుతున్నారని తెలిపారు. తాలు, తరగు పేరుతో ప్రభుత్వం రైతుల వద్ద 5 నుంచి ఆరు కిలోల వడ్లు తక్కువ చేసి కోనుగోలు చేయడం దారుణమని అన్నారు. అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన, వడ్లు కోనుగోలు ప్రక్రియలో వేగవంతం చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ, చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. నెల రోజులుగా మార్కెట్ యార్డులో మొక్కజొన్నలు తీసుకువచ్చి, వెచ్చిస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా గన్ని బ్యాగుల లేవని సాకులు చెబుతూ, రైతులను అరిగోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా గన్ని బ్యాగులు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



వెంటనే మార్కెట్ యార్డులో వడ్లు, మక్కలు కోనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి ఇలాకాలో రైతుల పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉంటే మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఏమీ సమీక్ష నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రైతుల పట్ల పొన్నం ప్రభాకర్ గారి నిర్లక్ష్యం, మొండి వైఖరిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులురైతులు, పాల్గొన్నారు.

## శివంపేట్‌లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం ఆలస్యం... రైతుల ధర్నా:



చౌటకూర్ మే 04 ( విజన్ ఆంధ్ర ) చౌటకూర్ మండలం శివంపేట్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ రైతులు ధర్నా చేపట్టారు. ఇప్పటికే తమ వరి కోత పూర్తి చేసి 15 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం నిల్వ ఉంచడం వల్ల నష్టం జరుగుతోందని, వర్షాలు పడితే మరింత ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తమ పంటను విక్రయించుకునేలా వెంటనే కేంద్రాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## 6న ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల పరిశీలన - ఎంపిడిఓ క్రాంతి కుమార్

మల్హర్, మే 04 విజన్ ఆంధ్ర: మండల పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 6న బుధవారం రోజున సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలో కేటగిరీ-1 (ఏడ బి) కింద 17 మంది, కేటగిరీ-××× కింద 35 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, దరఖాస్తు ఫారాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు సమాచారం అందించి, సకాలంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమానికి తహసీల్దార్‌తో పాటు బ్యాంక్ అధికారులు కూడా హాజరుకావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా రైతు వారోత్సవాలు

బాన్సువాడ మే 4 (విజన్ ఆంధ్ర). ఘనంగా రైతు వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. బాన్సువాడ మండల పరిధి లోని తాడ్కోల్ రైతు వేదికలో ( బోర్లం క్లస్టర్ )"ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక "99 రోజుల కార్యక్రమం లో భాగంగా "రైతు -వారోత్సవం కార్యక్రమం" నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం లో రైతులకు, మట్టి నమూనాలను సేకరించు విధానం, ఎరువులు వేసుకునే మోతాదులు, వానాకాలం పంటల రకాలు, సేంద్రియ వ్యవసాయం, వాన కాలం లో వేసుకోవాల్సిన వరి ధాన్యం వరి ధాన్యాల రకాలను గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో తాడ్కోల్ సర్పంచ్ అంది రమేష్, బోర్లం సర్పంచ్ మన్నె రమేష్, మొగులాన్ పల్లి సర్పంచ్ ఖత్రోత్ పూజారి, బుడిమి సర్పంచ్ ఖామృద్దీన్ క్లస్టర్ పరిధి గ్రామాల లోని గ్రామ పెద్దలు, రైతులు ఏఈఓ రాణి తదితరులు పాల్గొన్నారు.



# సిరిపురంలో నరకప్రాయంగా ఆరో వార్డు రోడ్డు

-"వినతులు ఇస్తున్నామే తప్ప, మా రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు"

- అధికారుల, ప్రజాప్రతినిధుల పై నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



మర్పల్లి, మే 04 (విజన్ ఆంధ్ర): వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురం గ్రామంలోని ఆరో వార్డు రహదారి అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ దారి గుంతలమయంగా మారి, రాళ్లు తేలి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రోడ్డుపై నడవాలంటే ప్రజలు జంకుతున్నారు.

ఈ మార్గంలో రెండు కిరాణా షాపులు ఉండటంతో నిత్యం ప్రజల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే రోడ్డుపై పెద్ద పెద్ద రాళ్లు తేలి ఉ ండటంతో, నిత్యావసరాల కోసం వెళ్లే వృద్ధులు, చిన్న పిల్లలు తడబడి కిందపడుతూ గాయాలపాలవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం అదుపుతప్పి పడిపోతామనే భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. రోడ్డు దుస్థితిపై స్థానిక నివాసితులు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. వినతులు ఇస్తున్నామే తప్ప, మా రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై గ్రామంలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి, ఆరో వార్డులో నూతన సి.సి. రోడ్డు నిర్మించి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే అధికారులు ప్రజా ప్రతినిధులే బాధ్యత వహించాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

# కుత్బుల్లాపూర్‌లో 'హిందూ మహా సమ్మేళనం'

- భక్తి, సంస్కృతి, దేశభక్తి త్రివేణి సంగమశీ.

- మే 9న వేణుగోపాల స్వామి ఆలయ గ్రౌండ్‌లో ఘన నిర్వహణ

- ముఖ్య వక్తలుగా గరికపాటి నరసింహారావు, ఉప్పలంచ మల్లికార్జున




కుత్బుల్లాపూర్, మే 4 (విజన్ ఆంధ్ర): హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతి సంప్రదాయాల పరిమళం, ప్రబల దేశభక్తిని చాటిచెప్పే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ వేదికగా హిందూ మహా సమ్మేళనం' అంగరంగ వైభవంగా జరగనుంది. 2026 మే 9వ తేదీ శనివారం సాయంత్రం 5:00 గంటలకు వేణుగోపాలపురం పరిధిలోని శ్రీ వేణుగోపాల స్వామి టెంపుల్ గ్రౌండ్ సమీపంలో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సమ్మేళనంలో అగ్రశ్రేణి ప్రవచనకర్తలు పాల్గొనడం విశేషం. ప్రముఖ పద్మశ్రీ పురస్కార గ్రహీత, అవధాని శ్రీ గరికపాటి నరసింహారావు తన వాగ్ధాటితో ధార్మిక, సామాజిక అంశాలపై ప్రజలకు దిశానిర్దేశం చేయనున్నారు. వారితో పాటు ప్రముఖ వక్త శ్రీ ఉప్పలంచ మల్లికార్జున భక్తి మార్గంపై ప్రసంగించి భక్తులను అలరించనున్నారు. వేణుగోపాలపురం, వాజపేయి నగర్, ఇంద్రసింగ్ నగర్ బస్తీల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా రూపొందించారు. కేవలం ప్రసంగాలు మాత్రమే కాకుండా: హిందూ సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు. యువతలో స్ఫూర్తిని నింపే దేశభక్తి గేయాలు, నాటికలు. కుటుంబ సమేతంగా వీక్షించేలా ఆహ్లాదకరమైన ఏర్పాట్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సమితి అధ్యక్షులు డాక్టర్ గోపాల కృష్ణ ఆర్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. సమ్రాట్ కుమార్ నేతృత్వంలో ఈ సమ్మేళన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉపాధ్యక్షులు నల్ల జై శంకర్ గౌడ్, పులి బాలరామ్, నాగ దీప్; సంయుక్త కార్యదర్శులు ప్రియాంక, బాబీ నీల, ప్రసన్న, జగదీష్ ఈ కార్యక్రమ విజయానికి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. "మన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఈ మహా సమ్మేళనానికి కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లోని హిందూ బంధువులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి తరలివచ్చి జయప్రదం చేయాలి." అని నిర్వాహక బృందం విజ్ఞప్తి చేసింది.

## శివంపేటలో ముగిసిన పోచమ్మ తల్లి విగ్రహా పత్రిష్ఠోత్సవాలు

చౌటకూర్ మే 04 ( విజన్ ఆంధ్ర ) చౌటకూర్ మండలం పరిధిలోని శివంపేట్ గ్రామంలో కొనసాగుతున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ముగిసాయి. ఈనెల తేదీన నుంచి ప్రారంభమైన నాలుగు రోజుల పాటు పసలవాది లోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వైదిక పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగినాయి. సోమవారం గర్తబీజ ,దాతు రత్న, న్యాసములు,యంత్రం ప్రతిష్ట,ప్రాణ ప్రతిష్ట,జీవకళాన్యాసము, పూర్ణాహుతి మహదాశీర్వచనము వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళలో అమ్మవారి కి ఘనంగా బోనాలు ఊరేగింపు నిర్వహించారు. విగ్రహం ప్రతిష్ట మహోత్సవాలు ముగింపు రోజున రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, రామచంద్రపురం కార్పొరేట్ పుష్పనగేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు



సైతర సాయికుమార్ లు అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అహుతులను నిర్వహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

# అడవి గుహలో అద్భుత శిల్పకళా సంపద



భూపాలపల్లి జిల్లా, మల్హార్ మే 04 విజన్ ఆంధ్ర:దట్టమైన అడవి.. పక్కనే పరవళ్లు తొక్కే మానేరు నది.. అద్భుతమైన శిల్పకళా చాతుర్యం.. ఇన్ని ప్రత్యేకతలున్న కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలోని 'నైన గుడి' (శ్రీ శ్రీ శ్రీ మహా రామలింగేశ్వర స్వామి శివాలయం) నాటి నుండి నేటి వరకు పాలకుల ఆదరణ కరువై వెలుగులోకి రాలేకపోతోంది. జైనుల కాలంలో గుట్టనే గుహగా మలిచి నిర్మితమైన ఈ ఆలయాలు ఒకప్పుడు ఆధ్యాత్మిక కేంద్రాలుగా విరాజిల్లినట్లు పండితులు చెబుతున్నారు. జైనుల కాలం నాటివి కావడంతోనే వీటిని స్థానికులు కాలక్రమేణ 'నైన గుడులు'గా పిలుచుకుంటున్నారనే ప్రచారం ఉంది. జైనుల నాటి లిపి వందల ఏళ్ల క్రితం వేసిన రంగుల పెయింటింగ్ డిజైన్లు ఇప్పటికీ భక్తులను కట్టిపడేస్తున్నాయి. ఆలయం వెలుపల జైనుల కాలం నాటి లిపి శిలాశాసనాలపై చెక్కబడి ఉండడం ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యతను చాటిచెబుతోంది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా

### అభివృద్ధికి ఆమడ దూరంలో 'నైన గుడులు'

### - రామలింగేశ్వరాలయ అభివృద్ధిపై ఎండోమెంట్ దృష్టి సారించేనా?

ఇక్కడి రామలింగేశ్వరుడికి భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో ఈ ఆలయం దశాబ్దాల పాటు పూజలకు నోచుకోలేదు. అయితే గత ఐదేళ్లుగా కొయ్యూరు గ్రామస్థులు, మండల భక్తులు కలిసి ఒక కమిటీగా ఏర్పడి ఆలయ పునరుద్ధరణకు నడుం బిగించారు. చిన్న చిన్న అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రతి ఏటా మహాశివరాత్రి వేడుకలను, శివపార్వతుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఆలయం ప్రకృతి సౌందర్యాల నడుమ ఉన్నప్పటికీ, అక్కడికి చేరుకోవడం భక్తులకు కత్తిమీద సాములా మారే పరిస్థితి నెలకొంది. సరైన రహదారి సౌకర్యం లేక అడవి గుండా అతికష్టంగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో అద్భుత పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉన్నప్పటికీ, ఎండోమెంట్ శాఖ మరియు ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఎండోమెంట్ పరిధిలోకి తీసుకువచ్చి నిధులు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు. పాలకుల ప్రోత్సాహం ఉంటే ఈ దట్టమైన పచ్చని చెట్ల నడుమ ఉన్న ఈ చారిత్రక నైన గుడి గొప్ప పర్యాటక క్షేత్రంగా విరాజిల్లుతుందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.




### జిల్లా టాపర్ ప్రణవికి ఘన సన్మానించిన శ్రీసాయి వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ డాక్టర్ వీరమనేని సంపత్ రావు

భూపాలపల్లి జిల్లా, మల్హార్, మే 4 విజన్ ఆంధ్ర : తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మేనం ప్రణవిని శ్రీ సాయివాణి విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించింది. మండల కేంద్రంలోని శ్రీ సాయివాణి విద్యానికేతన్‌లో ప్రణవి 1 నుంచి 5వ తరగతి వరకు విద్యనభ్యసించి, అనంతరం తాడిచర్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తమ పూర్వ విద్యార్థిని ప్రణవిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వీరమనేని సంపత్ రావు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలో పునాది వేసుకున్న విద్యార్థిని జిల్లా స్థాయిలో టాప్‌గా నిలవడం గర్వకారణమని కొనియాడారు. సాయివాణి పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విత్తనం వలె మొలకెత్తి, నేడు మహావృక్షాల్లా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రణవి మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో నేల ఆరోగ్యం పై అవగాహన

### 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విస్తృత ప్రచారం.



టేకులపల్లి, విజన్ ఆంధ్ర మే 4: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో ఈరోజు మండలంలోని ఐదు రైతు వేదికల్లో వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నేల ఆరోగ్యం, సమతుల ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి రకాల సాగు పై వివరంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఆహార భద్రత కోసం నేల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పంట దిగుబడితో పాటు పశుగ్రాసం కూడా మెరుగ్గా ఉంటేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. గతంలో ఒక కేజీ ఎరువు ద్వారా 18 కేజీల ధాన్యం పండుతుండగా, ప్రస్తుతం అధిక రసాయన ఎరువుల వినియోగంతో 10 కేజీల ఎరువుకు కేవలం 3 కేజీల ధాన్యం మాత్రమే పండుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల రైతులు పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పేడ వంటి సహజ వనరులను వినియోగించి పంటలు పండించాలని సూచించారు.

అలాగే ఆవు పేడ, పుట్టమన్ను, పప్పు దినుసుల పిండి, బెల్లంతో జీవామృతం తయారు చేసి, వేప, వావిలతో కషాయం తయారు చేసి పంటలపై పిచికారి చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు. వరి సాగులో 120 రోజుల్లో పండే సన్న రకాలైన డబ్ల్యూ జి ఎల్ -44, కే ఎన్ ఎం -1638, ఆర్ఎన్ఆర్-15048 రకాలను సాగు చేస్తే ఎల్‌నినో ప్రభావం నుండి తప్పించుకోవచ్చని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ బి. మంగీలాల్, మండల వ్యవసాయాధికారి అన్నపూర్ణ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రావణి, సర్పంచులు బి. పూల్ బంతి, ఎం. రమాదేవి, కే. లక్ష్మీ, జి. లక్ష్మీనాయక్, ఆత్మ సభ్యుడు రాసమల్ల నర్సయ్య, ఉపసర్పంచ్‌లు చేతుల నాగేశ్వరరావు, ఉండేటి చెన్నయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# బైక్ ను ఢీకొన్న బోరు బండి..



కుకునూరుపల్లి, మే 04,విజన్ ఆంధ్ర : మండల కేంద్రంలోని మంగోలు ఎక్స్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాన్ని బోరు బండి ఢీకొనడంతో ద్విచక్ర వాహదారుడికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అంబులెన్సు కి సమాచారం అందించగ, మెరుగైన వైద్యం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన వ్యక్తి మంగోలు గ్రామానికి చెందిన గజ్జె కుమార్ అని స్థానికులు పేర్కొనగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు 'ఎన్ హెచ్ ఆర్ ఘన సన్మానం

### - పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు 'ఎన్ హెచ్ ఆర్ ఘన సన్మానం

### - మండల టాపర్లకు నగదు పారితోషికం అందజేత



భూపాలపల్లి జిల్లా, మల్హార్, మే04, విజన్ ఆంధ్ర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మేనం ప్రణవి, లాస్య, ఆశ్రితలను నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు జ్యోతీశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, యాంటీ కరప్షన్ బ్యూరో జాతీయ అధ్యక్షుడు వీరమనేని సంపత్ రావు సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరమనేని సంపత్ రావు మాట్లాడుతూ.. గతంలో మలహార్, చిట్యాల, టేకుమట్ల మండలాల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేసిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కమిటీ తరఫున మొదటి బహుమతిగా రూ. 2500, రెండో బహుమతిగా రూ. 1000 నగదును అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు తిర్రి అశోక్ గౌడ్ , రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ జల్లరాపు ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడుదుల రాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీ రాగం కుమార్, సుదర్శన్, లింగన్నపేట శ్రీనాథ్, జెడ్పీ హెడ్ మాస్టర్ తిరుపతి, ఉపాధ్యాయులు కుమారస్వామి, మహేష్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అదుపు తప్పిన కాలువలోకి దూసుకువెళ్లిన ట్రాక్టర్ ఇంజన్

చౌటకూర్ మే 04 ( విజన్ ఆంధ్ర ) మండలం కేంద్రమైన చౌటకూర్ లోని అదుపు ట్రాక్టర్ ఇంజన్ సోమవారం దుసుకు వెళ్ళింది. సర్వేపల్లి గ్రామ సర్పంచ్ నందికంటి రామచంద్ర రెడ్డి ట్రాక్టర్ను వరి కోత మిషన్ పోసిన వరి ధాన్యం తరలించేందుకు ఏర్పాటు చేశారు. అయితే ట్రాక్టర్స్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వలనే వాహనం అదుపు తప్పి కాల్వలోకి దూసుకు వెళ్లిందని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనలో డ్రైవర్ కమ్మరి వీరేశంకు గాయాలయ్యాయి. ట్రాక్టర్ నడుపుతున్న సమయంలో ట్రాలీ నుంచి ఇంజన్ వేరై కాలువలోకి వెళ్లి ఇరుక్కుపోయింది. సంఘటన విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యజమాని రామచంద్ర రెడ్డి మరో వాహనం సహాయంతో కాలువలో ఇరుక్కుపోయిన ఇంజన్ బయటకు తోలగించారు



## నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలి : బీజేపీ

ఇబ్రహీంపట్నం, మే 4 (విజన్ ఆంధ్ర ) : 10న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు విజయ్ నాయక్ అన్నారు. 10న ప్రధాని నరేంద్ర మోడీ సికింద్రబాద్ రానున్న సందర్భంగా ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని సోమవారం యాచారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ పాల్గొనే బహిరంగ సభకు పెద్ద ఎత్తున మండలం నుండి తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నరేంద్ర మోడీకి ఘన స్వాగతం పలకాలని కోరారు. అనంతరం పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో టపాసులు కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రిపల్లి అంజయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి మధుకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు తాండ్ర రవీందర్, సీనియర్ నాయకులు యాదయ్య, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి దయతో ప్రజలంతా చల్లగా ఉండాలి

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**- పట్నంలో శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణంలో ఎమ్మెల్యే**

ఇబ్రహీంపట్నం, మే 4 (విజన్ ఆంధ్ర ) : శ్రీ మల్లికార్జున స్వామి దయతో ప్రజలంతా చల్లగా ఉండాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆకాంక్షించారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని యాదవ సోదరుల కులదైవమైన శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా యాదవ సోదరుల ఆహ్వానం మేరకు కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసి, మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... యాదవ సోదరుల ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణలో ఇలాంటి కల్యాణ మహోత్సవాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



### భద్రాచలం ఐటిడిఏలో

# గురుకుల ఆర్ సి ఓ పై అవినీతి ఆరోపణలు...!

## విచారణకు డిమాండ్

**-- లంబాడీ హక్కుల పోరాట సమితి**



టేకులపల్లి, విజన్ ఆంధ్ర మే 4: భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో రీజినల్ కోఆర్డినేటర్ చేస్తున్న అవినీతి, అక్రమాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని (లంబాడీ హక్కుల పోరాట సమితి) డిమాండ్ చేసింది. సంస్థ ప్రతినిధులు వెల్లడించిన వివరాల ప్రకారం, గురుకుల విద్యాసంస్థల్లో ఆర్ సి ఓ పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడం వల్ల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మంచినీరు, భోజన సౌకర్యం, వసతి, విద్యా వనరులు లేకపోవడంతో పాఠశాలలు క్షీణ స్థితికి చేరుకున్నాయని ఆరోపించారు. 2023--24లో విడుదల చేసిన ఎలక్ట్రీషన్, ప్లంబర్ పోస్టుల నోటిఫికేషన్‌లో మెరిట్ జాబితాను పక్కన పెట్టి, అర్హత లేని వ్యక్తుల నుంచి డబ్బులు తీసుకొని అక్రమంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆరోపణలు.

ప్రాజెక్ట్ అధికారి అనుమతి లేకుండా రూ. 1 లక్ష తీసుకుని ఉద్యోగిని ఒక కళాశాల నుంచి మరొకదానికి అక్రమంగా బదిలీ చేసిన ఘటన. మహిళా కళాశాలలో పురుషులను నియమించకూడదన్న నిబంధనలను తుంగలో తొక్కి, డబ్బుల కోసం నియామకాలు చేపట్టినట్లు ఆరోపణలు.

రెగ్యులర్ ఉద్యోగులకు రావాల్సిన ఇంక్రిమెంట్ల కోసం రూ. 10,000 నుండి రూ. 20,000 వరకు లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు. అమాయక గిరిజన విద్యార్థుల నుంచి అడ్మిషన్ల పేరుతో రూ. 10,000--20,000 వరకు వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలు. నోటిఫికేషన్ లేకుండా, మెరిట్‌ను పక్కన పెట్టి ఇతర జిల్లాలకు చెందిన వారిని నియమించి డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా, ఒక సందర్భంలో నియామకాన్ని రద్దు చేసినట్లు సమాచారం.

తక్షణ విచారణకు గురుకుల వ్యవస్థలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేసి, ఆర్ సి ఓ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్ హెచ్ పి ఎస్ కమిటీ డిమాండ్ చేసింది.

## రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి న్యాయం చేయాలి

**- భూమి పట్టా ఇచ్చారు రికార్డుల నుంచి తొలగించారు.**

**- సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆర్డీవోకు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన గిరిజన మహిళ**



హుస్నాబాద్, విజన్ ఆంధ్ర మే 4 : రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో భూ పపరిశీలన చేసి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం రోజున సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డిఓ రామ్మూర్తికి ప్రజావాణిలో వంగరామయ్యపల్లి గ్రామానికి చెందిన లావుడ్య జ్యోతి అనే గిరిజన మహిళ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్న నాకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేదని సదరు గిరిజన మహిళ ఆర్డీవో ఎదుట వాపోయారు. పోతారం ఎస్ గ్రామ శివారులో 267 సర్వే నంబర్ లో ఒక ఎకరం విస్తీర్ణం గల భూమి కొనుగోలు చేశానని అప్పటి రెవెన్యూ అధికారులు నా పేరుతో ఆర్ ఓ ఆర్ లో నమోదు చేసి పట్టా ఇచ్చారని ఆ తర్వాత రికార్డు నుంచి తొలగించి వేరే పేరు మీద నా భూమిని బదలాయించారని ఆమె విలేకరుల ఎదుట వాపోయారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఆర్జీ పెట్టుకున్న దరఖాస్తు తీసుకుని మీ సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పడమే తప్ప నాకు న్యాయం చేయడం లేదని ఆమె అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ లో ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశానని అప్పటి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఇక్కడ తహసిల్దార్ కు సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశాలు ఇచ్చినప్పటికి నాకు ఎలాంటి పరిష్కారం లభించలేదన్నారు. నేను హైకోర్టును కూడా ఆశ్రయించడం జరిగిందని, హైకోర్టు కూడా నాకు అనుకూలంగా తీర్పు ఇచ్చి న్యాయం చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు నా భూ సమస్యకు పరిష్కారం లభించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య కాగితాలకే పరిమితం అవుతున్నాయి తప్ప అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో ఎవరు కాస్తు చేస్తున్నారో చూసి వారికి న్యాయం చేయడంలో విఫలమయ్యారని ఇలాంటి భూ సమస్యలు అనేకం ఉన్నాయని ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సదరు భూమిపై విచారణ జరిపించి అధికారులు నా భూ సమస్యకు పరిష్కారం చూపాలని ఆమె ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు విలేకరులకు తెలిపారు.

## అబ్‌స్టాకల్ నిర్మాణానికి భూమిపూజ

**- నరేష్ గౌడ్ సాకారంతో ఏర్పాటు**

**- పాల్గొన్న ఎస్ఐ కాశీనాథ్**

జహీరాబాద్, మే 04 (విజన్ ఆంధ్ర): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు శిక్షణ అందించే ఉద్దేశంతో అబ్‌స్టాకల్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ కాశీనాథ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ పాల్గొని భూమిపూజ నిర్వహించారు. నరేష్ గౌడ్ సహకారంతో ఈ అబ్‌స్టాకల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అబ్‌స్టాకల్ ఏర్పాటు ద్వారా ఎన్‌సీసీ విద్యార్థులతో పాటు ఇతర యువతకు శారీరక శిక్షణలో ఎంతో ఉపయోగపడుతుందని



నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.ఎన్ గుప్తా, హెచ్ఓడీ రమేష్ కుమార్, ఏఎన్ఓ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



## విజయ్ విజయంతో ఓయూ లో విద్యార్థుల సంబరాలు...

తమిళనాడు ఎన్నికల్లో అంబేద్కర్, పెరియార్ లాంటి మహానీయుల సిద్ధాంత స్ఫూర్తితో ఎన్నికల్లో ఒంటరిగా నిలిచి విజయం సాధించి యువతకు ఆదర్శంగా నిలిచిన సినీ నటుడు దళపతి విజయ్ విజయాన్ని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, ఝూూ రాష్ట్ర అధ్యక్షులు డా. తాళ్ళ అజయ్ , ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నంద్రుం నర్సింహా, ఓయు జేఏసీ నేత డా. యుగంధర్,ప్రశాంత్, దీూఖీ ఓయూ అధ్యక్షులు శ్రీశైలం, మనోజ్, దీూఖీ ఓయూ ఇన్చార్జి ఆరెకంటి శ్రీకాంత్,ఆన్సర్,శివాజీ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు

## తడిసిన వరి మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 4 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం రోజున కురిసిన అకాల వర్షం పడగా మార్కెట్ యార్డులో రైతులతో కలిసి తడిసిన మొక్కజొన్నలు, వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని స్థానిక బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ మార్కెట్ యార్డ్ కార్యాలయం ముందు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న రైతులను మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డిని కలిసి మాట్లాడారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ పై అధికారులతో మాట్లాడి మధ్యాహ్నం వరకు గోనె సంచులు అందజేసి మొక్కజొన్న కొనుగోలు ప్రారంభిస్తామని, అలాగే తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ ఇచ్చిన హామీ మేరకు రైతులు ధర్నాను విరమించారు. అదేవిధంగా మార్కెట్ యార్డును సందర్శించిన హుస్నాబాద్ ఆర్డీఓ వి. రామ్మూర్తిని కలిసి అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం మరియు మొక్కజొన్నలను ప్రభుత్వం తక్షణమే కొనుగోలుచేయాలని బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెలరోజులు గడిచినా సరైన స్థాయిలో



కొనుగోళ్లు జరగక రైతులు రోజులు తరబడి మార్కెట్ యార్డుల్లోనే ఎదురుచూడాల్సి వస్తోందని తెలిపారు. అకాల వర్షాలతో వందలాది క్వింటాళ్ల ధాన్యం, మొక్కజొన్న తడిసి రైతులకు భారీ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమంపై కేవలం ప్రకటనలకే పరిమితమైందని, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ రైతుల సమస్యలపై స్పందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. రైతులకు నిజమైన సహాయం చేయాలంటే వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చిత్తారి శ్రీనివాస్, భోజు రవీందర్, మేకల వికాస్ యాదవ్, దొంత బోయిన శ్రీనివాస్,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్నింగ్ వాక్ వెళ్లిన వ్యక్తి శవంగా తిరిగి వచ్చాడు



భీమదేవరపల్లి మే 4(విజన్ ఆంధ్ర) వంంలక్కనారాంగ్ గ్రామానికి చెందిన గంప రమేష్ (56) అనే వ్యక్తి ముల్కనూరు నుండి కొత్తపల్లి వైపు ఉదయం ఐదు గంటల 20 నిమిషాలకు వాకింగ్ వెళుతుండగా ముల్కనూరు నుండి ఎల్కతుర్తి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతివేగంగా డ్రైవర్ అజాగ్రత్త నడపడంతో వాకింగ్ చేస్తున్న రమేష్ ను వెనక నుండి గుద్దడంతో రమేష్ అక్కడికక్కడే మరణించాడు. గుద్దిన వాహనం ఆపకుండా ఎల్కతుర్తి వైపు వెళ్లిపోయినది. రమేష్ కుమారుడు రోహిత్ ఇచ్చిన దరఖాస్తు తో విచారణ ప్రారంభించామని ఎస్సై రాజు తెలిపాడు

## సీఐ గా బాధ్యతలు చేపట్టిన కొండల్ రెడ్డి

### శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్సైలు.

పరిగి, మే 04(విజన్ ఆంధ్ర ) : పరిగి పోలీస్ స్టేషన్ కు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్గా కే. కొండల్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పని చేసిన సీఐ ఎస్. శ్రీనివాస్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కమిషనరేట్, హైదరాబాద్ బదిలీ కావడంతో అయన స్థానంలో నల్గొండ జిల్లా శాలిగౌరారం సర్కిల్ నుండి కొండల్ రెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ పరిగి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలుపవచ్చునని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీఐ కి పరిగి ఎస్సై మోహన్ క్రిష్ణ, దోమ ఎస్సై వసంత్ జాదవ్, కుల్కచెర్ల ఎస్సై రమేష్ కుమార్, చంగోముల్ ఎస్సై భరత్ రెడ్డి, ఎఎస్సైలు, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# రైతన్నల ఉసురు తీస్తున్న కాంగ్రెస్ సర్కార్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టకుంటే ప్రభుత్వంపై తిరుగబడతాం
- రైతు గౌరయ్య కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, మే 4 (విజన్ ఆంధ్ర ) : అన్నదాతకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నల ఉసురు తీస్తున్నదని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాయపోల్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మరణించిన రైతు మంగలి గౌరయ్య చావుకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఆయన కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎర్రటి ఎండాకాలంలో తేమశాతం పేరిట రైతులను రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలవద్ద పడిగాపులు గాయించడం సిగ్గుచేటని విమర్శించారు. యాసంగి వరికోతలు పూర్తికావస్తున్నా ధాన్యం కొనుగోళ్లు ఇంకా మొదలు కాలేదని అన్నారు. స్వయంగా స్థానిక ఎమ్మెల్యే వారం రోజుల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో నేటికీ కనీసం ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 15 కొనుగోలు కేంద్రాల్లో సుమారుగా 70 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయవలసి ఉండగా కనీసం రెండు వేల క్వింటాళ్లు కూడా నేటికి కొనుగోలు చేయలేదని అన్నారు. రైతులు తాము పండించిన పంటలను దళారులకు అమ్ముకున్నాకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా, వారికి బోనస్ డబ్బులు కూడా ఇవ్వకుండా మోసం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందని అయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తడిచిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి కొనుగోలు చేసామని ఆయన తెలిపారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఊరూరా కొనుగోలు కేంద్రాలు పెట్టి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసామని గుర్తు చేశారు. 70 వేల మంది రైతుల ఖాతాల్లో 11 విడతల్లో నేరుగా 73 వేల కోట్ల రైతుబంధు నిధులు జమ చేశామని చెప్పారు. నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చామని, ఎరువుల విత్తనాలు సకాలంలో రైతులకు అందించామని వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ, గొర్రెల పెంపకం, చేపల పెంపకం, హార్టికల్చర్, సెరీకల్చర్, ఫ్లోరీకల్చర్ తదితర రంగాలలో సమృద్ధిగా అభివృద్ధి సాధించామని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తిరిగి రైతులకు కష్టాలు వచ్చాయని,



అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఖర్మానికి కాంగ్రెసును తెచ్చుకున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పాలకులు రైతుల సమస్యలపై దృష్టి సారించాలని లేదంటే రైతులతో కలిసి ప్రభుత్వంపై తిరగబడతామని ఆయన హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తగిన వసతులు కల్పించాలని, వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్ రెడ్డి, దండేటికార్ రవి, తదితరులున్నారు.

## మహిళ మిస్సింగ్ కేసు నమోదు



జహీరాబాద్ మే 04 (విజన్ ఆంధ్ర): చిరగపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ కనివించకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మొగుడంపల్లి మండలం మిర్జాంపల్లి తండాకు చెందిన నెనావత్ వండు (43) సోమవారం పోలీస్ స్టేషన్‌కు హాజరై ఫిర్యాదు చేశారు. తన భార్య నెనావత్ రేఖాబాయి (40) గత 10 సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 27న మందులు తీసుకురావడానికి తన కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లగా, రేఖాబాయి ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. అదే రోజు సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో తిరిగి వచ్చేసరికి ఆమె ఇంట్లో కనిపించలేదు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు. కనిపించని మహిళ వివరాలు : పేరు: నెనావత్ రేఖాబాయి, వయసు: 40 సంవత్సరాలు, ఎత్తు: సుమారు 5 అడుగులు, వర్ణం: తెల్లగా, దుస్తులు: ఎరుపు రంగు చీర. ఈ ఘటనపై చిరగపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎవరికైనా రేఖాబాయి గురించి సమాచారం తెలిసిన పక్షంలో సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు కోరుతున్నారు.

## నిధులు మంజూరు పట్ల మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు కొయ్యురు సర్పంచ్ కొండ రాజమ్మ

మల్హార్, మే04 విజన్ ఆంధ్ర : భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలంలోని కొయ్యూరు గ్రామాభివృద్ధి కోసం సిఆర్ఆర్ నిధుల కింద రూ. 10 లక్షలు మంజూరు చేయడం పట్ల గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, గ్రామానికి నిధులు వచ్చేలా చొరవ చూపి, విశేష కృషి చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబుకు గ్రామస్తుల పక్షాన వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

**--వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.**

**--టీజీ ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్ ను ఆవిష్కరించిన మంత్రి.**

**--తాండూరు లో కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తాం**

తాండూరు మే 4 (విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4 నుంచి మే 9 వరకు రైతు వారోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'టీజీ ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్ను ఆవిష్కరించారు. సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ముందెన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆధునిక విప్లవాత్మక విధానాలు తీసుకువస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, రైతులు–వినియోగదారుల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పడానికి "టీజి ఆర్గానిక్స్" మొబైల్ యాప్ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్ తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ధృవీకరించబడిన రైతుల నుండి మాత్రమే ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. దీనివల్ల కల్తీ లేని అసలైన ఆర్గానిక్ ఆహారం దొరుకుతుందని పేర్కొన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతుల నుండి తాజా కూరగాయలు, పండ్లు, ధాన్యాలను కొనుగోలు చేయవచ్చన్నారు. వినియోగదారులు తమకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆర్గానిక్ రైతులను వెతుక్కుని, వారి ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. యాప్ ద్వారానే రైతులకు ఫోన్ చేసి, ఉత్పత్తుల వివరాలు తెలుసుకుని ఆర్డర్ చేయవచ్చన్నారు. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం లేకపోవడం వల్ల, రైతులు తమ పంటకు సరైన ధరను పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వినియోగదారులు రైతులు తమ పంటకు సరైన ధరను పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు తమ ఉత్పత్తులను పరిచయం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.



త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మరిన్ని సేవలు ఈ యాప్ను ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. తాండూరులో కందిబోర్డును ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అధికారం కోల్పోయిన వారు ఒకవైపు, అధికారంలోకి రావాలనుకున్నవారు మరోవైపు కాంగ్రెస్ ను బదులాం చేస్తున్నారని విమర్శించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం దండుగ కాదు పండుగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు సంబురంగా వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. తాండూరు నియోజకవర్గంలోని కోట్ పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలా ఉత్తి శిలాఫలకాలు వేయలేమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, డీసీసీ చైర్మన్ దారా సింగ్ తదితరులు న్నారు.

## వికలాంగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

జహీరాబాద్ మే 04 (విజన్ఆంధ్ర): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొనింటి నర్సింలు ఆధ్వర్యంలో వికలాంగుల ప్రతినిధులు నూతన జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఓర్పుతో విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వికలాంగుల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించేందుకు ప్రతి నెలలో ఒక శనివారం "ప్రత్యేక గ్రీవెన్స్ డే" నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో జిల్లాలో వికలాంగుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మాఫియా రాజ్యం...

**ఎక్సైజ్ శాఖ మౌనం వెనుక మిస్టరీ..!**

**- బెల్ట్ షాపులకు డైరెక్ట్ సరఫరా -- సిండికేట్ చేతుల్లో ధరల..**

**- నియంత్రణ... అధికారులపై గంభీర ఆరోపణలు..**

**- సిండికేట్ దందాకు ఎక్సైజ్ అండా..? ఆదేశాలు కాగితాలకే పరిమితం!.**

**- ఆదేశాలు ఫైళ్లలోనే... అమలు సిండికేట్ చేతుల్లో!**

**- బెల్ట్ షాపులకు ఓపెన్ సప్లై -- ప్రజల జేబుల దోపిడీ!**

**- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ యంత్రాంగం**

టేకులపల్లి విజన్ ఆంధ్ర మే 0 : టేకులపల్లి మండలంలో మద్యం సిండికేట్ పూర్తిగా నియంత్రణ చేపట్టి, మాఫియా స్థాయిలో అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు సంచలన ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ నియంత్రణ అన్నది కేవలం కాగితాలకే పరిమితమైపోయి, అసలు వ్యవస్థ మొత్తం సిండికేట్ చేతుల్లోకి జారిపోయిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైన్స్ షాపుల నుంచి నేరుగా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా బహిరంగంగానే జరుగుతోంది. గ్రామాలు,



తండాలు, కాలనీలు అన్న తేడా లేకుండా సిండికేట్ ఏర్పడి, తమే ధరలు నిర్ణయిస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారని సమాచారం. ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దందా పరిమాణం చిన్నది కాదు... రోజుకు లక్షలు, నెలకు కోట్లలో అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. సరఫరా, నిల్వ, పంపిణీ పూర్తిగా ప్లాన్ ప్రకారం నడుస్తున్న వ్యవస్థగా మారిందని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఇంత భారీ స్థాయిలో అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ మాత్రం పూర్తిగా మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడా దాడులు లేవు... తనిఖీలు లేవు... కేసులు నమోదు కావడం లేదు. దీంతో "ఇది అధికారుల అండ లేకుండా సాధ్యమా?" అన్న ప్రశ్న ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. మామూళ్ల కోసం ఎక్సైజ్ శాఖ కొందరు అధికారులు సిండికేట్‌తో కుమ్మక్కై ఉన్నారనే తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియంత్రణ చేయాల్సిన యంత్రాంగమే మౌనంగా ఉంటే, ఈ మద్యం మాఫియా మరింత రెచ్చిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. టేకులపల్లిలో పరిస్థితి ఇప్పుడు ప్రభుత్వ పాలనా వ్యవస్థ సిండికేట్ పాలన"గా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, అక్రమ మద్యం దందాను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# అవినీతికి పాల్పడుతున్న డిఆర్డిఏ పీడీ ని సస్పెండ్ చేయాలి

### ప్రజావాణిలో పిర్యాదు చేసిన రైతుకూలీ సంఘం నాయకులు

నిర్మల్, మే 4. ( విజన్ ఆంధ్ర ) : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పిచర, వడ్యాల్ తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భారీగా అవినీతి జరుగుతుందని పని చేయకున్నా పనిచేసినట్లుగా నమోదు చేసుకుంటూ రోజుకు రెండుసార్లు ఫోటోలు మాత్రమే తీసి కూలీల దగ్గర వారానికి 300 లు వసూలు చేస్తూ ఉపాధిహామీ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని వెంటనే విచారణ జరపాలని ప్రజలను పక్కదోవ పట్టిస్తున్న ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎన్ని పిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోని డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి గారిని వెంటనే ఈ జిల్లా నుండి బదిలీ చేయాలని ,ఉపాధి హామీలో రోజు కూలి 800 రూ.లకు పెంచాలని సం.కి 200 రోజులు పని దినాలు కల్పించాలని కూలీలకు పనిముట్లు గడ్డపార తట్ట పార కొనుగోలు చేసివ్వాలని, బీమా సౌకర్యం 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు బర్కుంట గంగారం ,జిల్లా కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, నాయకులు పానుగంటి నరేష్ ,బి ప్రసాద్ ,పుట్టి సాగర్ లుఉన్నారు

# ఎన్డీఏ విజయాలు ప్రజాభిమానానికి నిదర్శనం: కేఎస్ రత్నం

### - ఎన్డీఏ గెలుపుతో చేవెళ్లలో సంబరాల సందడి

చేవెళ్ల,మే 04 (విజన్ ఆంధ్ర): దేశవ్యాప్తంగా ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలనకు మద్దతుగా ఎన్డీఏ కూటమిపై విశ్వాసం వ్యక్తం చేశారని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. సోమవారం పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించడం పట్ల చేవెళ్ల పట్టణంలో భాజపా శ్రేణులు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించాయి. మున్సిపల్ అధ్యక్షుడు అత్తిలి అనంతరెడ్డి ఆధ్వర్యంలో బీజాపూర్ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించి నినాదాలతో ఊరేగించారు. అంబేద్కర్ కూడలిలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని తెలిపారు. కేంద్ర పథకాలను గ్రామీణ స్థాయికి చేర్చేందుకు శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌండ్ల కృష్ణ గౌడ్, జనరల్ సెక్రటరీ జ్ఞానేశ్వర్, డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి, కుంచం శ్రీనివాస్, మాణిక్య రెడ్డి, జై శంకర్ గౌడ్, కౌన్సిలర్ పెద్దోళ్ళ దయాకర్, చీర



శ్రీనివాస్, సత్యనారాయణ, అశోక్, విఠల్ రెడ్డి, కళ్ళెంల మహేందర్, మధుసూదన్ రెడ్డి, సంజీవ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అభిషేకర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, జయసింహారెడ్డి, పురషోతం రెడ్డి, వడ్డే గణేష్, వెంకటేష్ పాగ, శివ, రాఘవేందర్, రమేష్, బీరప్ప, శ్రీకాంత్ రెడ్డి, నగేష్, జైపాల్, శివరెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీకాంత్, అంజి, నగేష్, మాణిక్యం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. –

# విద్య, వైద్యం, వ్యవసాయం పైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి వెడ్మ బొజ్జు పటేల్

### - ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వార్షికోత్సవంలో జిల్లా కలెక్టర్, ఖానాపూర్ ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, మే 04, (విజన్ ఆంధ్ర) : ఇంద్రవెల్లి మండలం వాల్గొండ గ్రామంలో రైతు వేదికలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో బాగంగా రైతు వార్షికోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. గ్రామాల్లో రోడ్డు, నీటి వసతి, ఇందిరమ్మ ఇళ్లు, పెద్ద దేవుళ్ళకు షేడ్స్ మంజూరు చేశాం. అవసరం ఉన్న గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలియజేసి సమస్య తీర్చుకోవాలి. ఈ నెల తొమ్మిది తారీకు తర్వాత హైదరాబాద్ వెళ్ళి మంత్రి కొండా సురేఖతో ఇందిరమ్మ ఇళ్ల ఫారెస్ట్ సమస్య పైన మాట్లాడతాను అన్నారు. ఐటీడీఏ నూతన పీవో మంద మకరంద ఏజెన్సీలో విద్య, హాస్టళ్లలో విద్యార్థులకు భోజనాల పైన దృష్టి పెట్టాలి అన్నారు. ముత్నూర్ లోని 30 బెడ్స్ ఆసుపత్రిని ఇంద్రవెల్లికి తరలించాలని అధికారులకు ఆదేశించారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ అబివృద్ధి కొరకు వడగావ్ లో చెరువు నిర్మాణం చేపట్టాలనీ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అధికారులు ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో వెనుకబడిన ప్రజల అభివృద్ధికి విద్యా, వైద్యం, వ్యవసాయం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి, వేసవి లో విద్యుత్ అంతరాయం ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టాలి, పైలెట్ ప్రాజెక్ట్ కింద హీరాపూర్ గ్రామానికి సోలార్ సెట్లు మంజూరు చేశాం. ఈ నెల రెండు లేదా మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హీరాపూర్ గ్రామానికి వస్తారు. గ్రామాలలో ఉన్న పేదను రైతులు అమ్ముకోవద్దు, ఆర్గానిక్ తో పంటలు పండించే విధంగా చూడాలి, గిరిజన ప్రజలు ఎక్కువ ప్రోటీన్ ఫుడ్ ఇప్పపువ్వు, మిల్లెట్స్ తీసుకోవడం వలన హార్ట్ ఎటాక్స్ దరి చేరవన్నారు. వాయిపెట్, నర్సాపూర్, దంతన్ పల్లి, ముత్నూర్, శ్యాంపూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించేలా అధికారులను ఆదేశించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో మంద మకరంద, అధికారులు, గ్రామస్తులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో బరితెగింపు: ప్రభుత్వ భూమి 'స్వాహా'.. నిబంధనలకు 'పాతర'!

### - అధికారుల సీజ్ కాగితాలకే పరిమితం.. లోపల యథేచ్ఛగా సాగుతున్న పనులు

### - అనుమతి రెండు అంతస్తులకే.. నిర్మించింది మూడు!

### - పార్కింగ్ స్థలంలో వాణిజ్య సముదాయాలు.. పట్టించుకోని నిజాంపేట్ మున్సిపల్ యంత్రాంగం

నిజాంపేట్, మే 4 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ నగర శివార్లలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. బాచుపల్లి పరిధిలో నిబంధనలను తుంగలో తొక్కి, ఏకంగా ప్రభుత్వ స్థలాన్నే ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. సర్వే నంబర్ 109లో సాగుతున్న ఈ అక్రమ దందాతో స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**కేసు నమోదైనా తగ్గని జోరు!**

బాచుపల్లి సర్వే నంబర్ 109లోని రెడ్డి అవెన్యూను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఓ నిర్మాణదారుడు భవన నిర్మాణం చేపడుతున్నాడనే ఫిర్యాదుపై గత జనవరి 30న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భానుచందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది. అనంతరం నిజాంపేట్ టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు భవనాన్ని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే అధికారుల చర్యలు కేవలం కంటితుడుపు కోసమేనని స్పష్టమవుతోంది.

**అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..**

సదరు యజమాని టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి స్టిల్ట్+2 అంతస్తులకు మాత్రమే అనుమతి పొందారు. కానీ, అధికారుల అండదండలతోనో లేక వారి నిర్లక్ష్యంతోనో గానీ, నిబంధనలను అతిక్రమించి మూడో అంతస్తును కూడా నిర్మించేశారు. అంతటితో ఆగకుండా: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి భవన విస్తరణ చేపట్టారు. కేవలం పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాలను (షాపులు) ఏర్పాటు చేస్తున్నారు.

లి ప్రస్తుతం భవనం లోపల ఫినిషింగ్ పనులు, రంగులు వేసే పనులు










ముమ్మరంగా సాగుతున్నాయి.

**సీల్ బయట.. డీల్ లోపల?**

"మేము సీజ్ చేశాం" అని అధికారులు చెబుతున్నప్పటికీ, భవనం లోపల పనులు మాత్రం ఆగకపోవడం గమనార్హం. బయటకు సీజ్ చేసినట్లు చూపిస్తూ, లోపల పనులు పూర్తి చేసుకోమని నిర్మాణదారులకు అధికారులు అనధికారికంగా 'గ్రీన్ సిగ్నల్' ఇచ్చారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీదను వివరణ కోరగా.. తాము వచ్చి నాలుగు నెలలే అయిందని, మూడో అంతస్తును సీజ్ చేశామని, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మొక్కుబడి సమాధానం ఇచ్చారు.

**సామాన్యులకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?**

సామాన్యులు తమ చిన్నపాటి స్థలంలో ఇల్లు కట్టుకుంటే సెట్‌బ్యాక్‌ల పేరుతో జేసీబీలతో విరుచుకుపడే అధికారులు, కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, ప్రభుత్వ భూమిని కాపాడాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## పక్షవాతంతో బాధపడుతున్న హోంగార్డుకు భీమ్ ఆర్మీ సహాయం

జహీరాబాద్ మే 04 (విజన్ఆంధ్ర):జహీరాబాద్ ప్రాంతంలో కొంతకాలం పోలీస్ డిపార్ట్మెంట్లో హోంగార్డుగా పనిచేసిన ఎస్సీ మాల వర్గానికి చెందిన మొగులయ్య ప్రస్తుతం పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తెలంగాణ భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధు రావణ్ ఆయనకు ఆర్థిక సహాయం అందించారు. మొగులయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సిద్ధు రావణ్ ఆయనకు మెరుగైన వైద్యం అందేలా తనవంతు సహకారం అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, బలరాం కాంబ్లే, నరసింహ, అశోక్ పోలీస్, సందీప్, నాని, శ్రీకాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, మే 4 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సబ్ కలెక్టర్ మనోజ్తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును 30 రోజులలోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ దరఖాస్తు తిరస్కరించాల్సి వస్తే, దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు.

అలాగే, అందిన దరఖాస్తులను వెంటనే ప్రజావాణి పోర్టల్లో నమోదు చేసి, అర్జీదారులకు రసీదు ఇవ్వాలని తెలిపారు. ప్రజలు తమ దరఖాస్తు స్థితిని ఆన్లైన్లోనే తెలుసుకునే విధంగా పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు త్రాగునీరు, కూర్చొనే సౌకర్యాలు కల్పించాలని కూడా అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మర్పల్లిలో బీజేపీ విజయోత్సవ సంబరాలు: మూడు రాష్ట్రాల్లో ఘనవిజయంపై హర్షం

మర్పల్లి, మే 04 (విజన్ ఆంధ్ర):ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భాగంగా మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించడంతో మర్పల్లి మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఫలితాలు దేశంలో నరేంద్ర మోదీ గారి అవినీతి రహిత పాలనకు మరియు పేదల సంక్షేమం పట్ల ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ అరాచకత్వాన్ని అణిచివేసి ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు.తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో, మోసపూరిత పాలనతో ప్రజలను వంచిస్తోందని, ప్రజల్లో వారిపై తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయ సంబరాల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పలువురు



నేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు:

జిల్లా నాయకులు లక్ష్మణ్,సీనియర్ నాయకులు బలరాం గౌడ్, నాగన్న మండల ప్రధాన కార్యదర్శులు శ్రీమంత్ కుమార్, శివకుమార్, రాజేందర్ రెడ్డి, రమేష్, సాయి తదితరులు.నరేంద్ర మోదీ నాయకత్వం వర్ధిల్లాలని, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఈ సందర్భంగా నాయకులు నినదించారు.

# బస్టాండ్ నిర్మాణానికై ఆర్ఎంకు వినతి

కాటారం, మే 4 (విజన్ ఆంధ్ర ) : డివిజన్ కేంద్రమైన కాటారంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని వరంగల్ రీజనల్ మేనేజర్ కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య వినతి పత్రాన్ని అందజేశారు. కాటారం మండల కేంద్రంలోని కోట్లాది రూపాయల విలువైన ఆర్టీసీ బస్టాండ్ భూములను పరిరక్షించడంతో పాటు నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి చొరవ చూపాలని వరంగల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ భవాని ప్రసాద్ కు డిసిసి అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు కోరారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సోమవారం వరంగల్ లో ఆర్టీసీ ఆర్ ఎం, భూపాలపల్లి డిఎం సంబంధిత అధికారులతో కాటారం ప్రయాణ ప్రాంగణ నిర్మాణం పై చర్చించారు. కోర్టులో కేసు నడుస్తున్నందున రాష్ట్ర లీగల్ సెల్ ను అప్రమత్తం చేసి క్లియరెన్స్ తెప్పిస్తే మంత్రి శ్రీధర్ బాబు బస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులకు తెలిపారు.బస్ స్టేషన్ నిర్మాణంతోపాటు కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు ఆర్టీసీ నాయకులు లీగల్ సెల్ ద్వారా క్లియరెన్స్ సర్టిఫికెట్స్ టెండర్ ప్రాసెస్ వెంటనే నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు. ధన్వాడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మకూరి కుమార్ యాదవ్, పున్నం రమేష్ తదితరులు ఆర్టీసీ ఆర్ఎం ను కలిసిన వారిలో ఉన్నారు.

# వేతనాలు లేక వెతలు- ధర్నాకు దిగిన సఫాయిలు !!

కాటారం, మే 4 (విజన్ ఆంధ్ర) : వేతనాలు లేక వెతలు పడుతున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ధర్నాకు దిగారు. జీతాలు రాక కాటారం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. గత ఎనిమిది నెలలుగా జీతాలు రాకపోవడంతో సోమవారం అంబేద్కర్ కూడలి వద్ద పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కార్మికులు మాట్లాడుతూ, నెలల తరబడి జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. రోజూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచేది మేమే... కానీ మా కష్టానికి తగిన ప్రతిఫలం అందడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి జీవనం కొనసాగిస్తున్నామని, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు భరించడం కష్టంగా మారిందని తెలిపారు. ధర్నా ప్రదేశంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై కార్మికులు అసహనాన్ని వ్యక్తం చేశారు. వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని, లేదంటే ఆందోళనను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు.

# రైతు వేదికలతో... లాభసాటిగా వ్యవసాయం

### – అవగాహనతోనే నష్టాన్ని నియంత్రించవచ్చు

### - వెల్ జర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్

షాద్ నగర్, విజన్ ఆంధ్రా మే4 : ఫరూఖ్నగర్ మండలంలో రైతు వేదికలు రైతు వారోత్సవాలతో కళకళలాడుతున్నాయి. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు రైతుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయి. వెల్జర్ల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్, ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతు వేదికలలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు నేలను కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఎరువుల సమతుల్య వినియోగం, నానో ఎరువుల ప్రయోజనాలపై వివరించారు.



పంటల వారీగా ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పంటల మార్పిడి, పచ్చి ఎరువు పంటల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. సమయానికి పంటలను పరిశీలించడం ద్వారా తెగుళ్లు, పురుగులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోవచ్చని సూచించారు.భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా నేలలో పోషకాల లోపాలను గుర్తించి సమగ్ర పోషక యాజమాన్యం పాటించవచ్చని అధికారులు తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి సాయిల్ వాలంటీర్లను నియమించి రైతులకు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వైపు మళ్లాలని సూచించారు. నానో యూరియా వాడకం వల్ల మొక్కలకు సమర్థవంతంగా పోషకాలు అందడంతో పాటు పర్యావరణానికి హాని తక్కువగా ఉంటుందని వివరించారు.ఎరువులను ఒకేసారి కాకుండా విడతల వారీగా వాడడం ద్వారా పంటలు సమతుల్యంగా పెరుగుతాయని తెలిపారు.గతంలో సేకరించిన మట్టి నమూనాల ఫలితాల కార్డులను రైతులకు అందజేశారు. రైతులు సమగ్ర ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాల సమతుల్యతపై దృష్టి పెట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- అకాల వర్షాలతో

# భారీగా పంట నష్టం



కారేపల్లి,మే05 (విజన్ ఆంధ్ర) : అకాల వర్షాలు మొక్కజొన్న పంట రైతులను ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టివేసి,తీవ్ర శోకాన్ని మిగిల్చిందని, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ డిమాండ్ చేశారు.సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులను ఆదుకోవాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకస్మాత్తుగా కురిసిన వర్షాలు,ఈదురు గాలులతో వేలాది ఎకరాల్లో పంట తడిసిపోయిందని,రైతుల కంట శోకాన్ని మిగిల్చిందని అన్నారు.ఓవైపు పండించిన పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర ఎంఎస్పి కల్పించకపోగా,జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్లే వర్షానికి మొక్కజొన్న పంట తడిసి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిలిందని అన్నారు.దీనికి పూర్తి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించి నష్టపోయిన బాధిత రైతులకు నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్కె కాసిం,ఎం.గిరి,ఎం.సురేష్,పి మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించిన వీసీ, రిజిస్ట్రార్‌కు ఇంజనీరింగ్ విద్యార్థుల అభినందనలు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 4 : ఎండకాలం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకున్న శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ లు హుస్నాబాద్ మండల శివారులోని కిషన్ నగర్‌లో ఉన్న యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రిజిస్ట్రార్ లకు విద్యార్థులు అభినందనలు, ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మండే ఎండలో ప్రతిరోజూ ప్రయాణించడం చాలా కష్టంగా మారిందని,తమ సమస్యను గుర్తించి వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని వారు మరోసారి నిరూపించారని అన్నారు. యూనివర్సిటీ తీసుకున్న ఈ సత్వర నిర్ణయం వల్ల విద్యార్థులకు గణనీయమైన ఊరట లభించిందని, దీంతో చదువులపై మరింత దృష్టి పెట్టగలుగుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థుల కొరకు



ప్రత్యేకంగా కృషి చేసిన ప్రిన్సిపల్ తిరుపరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకొక బస్సు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రిన్సిపల్ తెలిపారు.

## పదవ తరగతి మండల టాపర్ కు ఘన సన్మానం

జన్నారం, మే 04 (విజన్ ఆంధ్ర) : పదవ తరగతి మండల టాపర్ ను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయ కులు ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుద లైన పదవతరగతి పరీక్ష ఫలితాలలో జన్నారం మండలకేంద్రానికి చెందిన అల్ఫియా షిఫాలీ 583 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచిన సందర్భంగా సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీ మై నారిటీ నాయకులు ఆమెకు మిఠాయిలు తినిపించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇక ముం దు కూడా పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురా వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎంసి వైస్ చైర్మన్ సయ్యద్ ఫసీఉల్లా, మాజీ ఎంపిటిసి ఎండి రియాజుద్దీన్, ఎంఏ రజాక్, పోన కల్ గ్రామ వార్డు సభ్యులు మోసిన్ షా ఖాన్, ఎం డి అజహర్, మౌలానా, అహ్మద్ తదితరులు పా ల్గొన్నారు.

## రక్తదానం చేసి గర్భిణికి ప్రాణం పోసి - రెండు ప్రాణాలు కాపాడిన ఆటో డ్రైవర్ అభిరామ్

బెల్లంపల్లి మే 4 విజన్ ఆంధ్ర : సంక్షోభ సమయంలో చురుకుగా స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని నిరూపించిన ఘటన తాండూర్ మండలంలో చోటుచేసుకుంది. ఎన్‌వీకే త్రీ (మన్నెగూడ) గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అభిరామ్, పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని తన ఆటోలో సమీప ఆసుపత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స కోసం రక్తం అవసరమని చెప్పడంతో,ఆటో డ్రైవర్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశాడు. దీంతో తల్లి, శిశువు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తాండూర్ మండల ఆటో యూనియన్ నాయకులు అభినందించారు. మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మాట్లాడుతూ, స్వార్థం పెరిగిన ఈ రోజుల్లో ఇలాంటి సేవాభావం సమాజానికి ఆదర్శం అని పేర్కొన్నారు.

# టౌన్ ప్లానింగ్‌లో 'అక్రమ' సెగలు.. కుత్బుల్లాపూర్ జోన్‌లో వ్యవస్థాగత వైఫల్యం!

### 'ప్రజావాణి'లో వెల్లువెత్తిన నిరసన.. 23 అర్జీల్లో అధికం అక్రమ నిర్మాణాలపైనే

### నాలుగు సర్కిళ్లలోనూ అదే దుస్థితి.. అధికారుల పర్యవేక్షణపై పౌర సమాజం ప్రశ్నలు

కుత్బుల్లాపూర్, మే 04 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమం స్థానిక పాలనలోని లొసుగులను, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలోని వ్యవస్థాగత లోపాలను బట్టబయలు చేసింది. ప్రజల గోడును వినేందుకు ఏర్పాటు చేసిన ఈ వేదిక కాస్తా, అధికారుల నిర్లక్ష్యంపై నిరసన గళంగా మారింది. దుండిగల్, కొంపల్లి, గాజులరామారం, జీడిమెట్ల సర్కిళ్ల నుంచి వచ్చిన మొత్తం 23 అర్జీలలో సింహభాగం అక్రమ నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలపైనే ఉండటం గమనార్హం.

**నిఘా సడలింపు.. అక్రమార్కులకు అండ!**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల వెల్లువ టౌన్ ప్లానింగ్ విభాగంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎంత అధ్వాన్నంగా ఉందో అద్దం పడుతోంది.

**నిబంధనలు తుంగలో తొక్కారు:**

సిద్ధివినాయక నగర్‌లో ప్లాట్ నంబర్లు 35, 36తో పాటు, సుభాష్ నగర్‌లో సర్వే నంబర్ 240లో నిబంధనలను యథేచ్ఛగా అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు మండిపడుతున్నారు.

**పార్కులకు రక్షణ కరవు:**

సామాన్యులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన కేటీఆర్ 'పార్కు' వంటి ప్రభుత్వ స్థలాలు కూడా ఆక్రమణలకు గురవుతుంటే, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సర్కిళ్ల వారీగా 'అక్రమాల' చిట్టా:

జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలోనూ టౌన్ ప్లానింగ్ విభాగానికి వ్యతిరేకంగానే ఎక్కువ ఫిర్యాదులు అందాయి:

గాజులరామారం సర్కిల్ కు అందిన 4 ఫిర్యాదుల్లో 3 టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవే.

దుండిగల్ కు వచ్చిన 5 వినతుల్లో 3 అక్రమ నిర్మాణాలపైనే రావడం గమనార్హం.

కొంపల్లి: ఇక్కడ ప్రధానంగా అక్రమ లేఅవుట్లు, కబ్జాలపై ప్రజలు ఫిర్యాదు చేశారు.

జీడిమెట్ల సర్కిల్లో శానిటేషన్ సమస్యలతో పాటు టౌన్ ప్లానింగ్ అక్రమాలపై సమాన స్థాయిలో ఫిర్యాదులు అందాయి.

**ఉపేక్షించేది లేదు: అధికారుల హెచ్చరిక**

ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై డిప్యూటీ కమిషనర్లు డాక్టర్ ఎస్. వెంకట మణి కరన్, డి. లావణ్య స్పందించారు. అక్రమ నిర్మాణాలను ఏ మాత్రం సహించే ప్రసక్తే లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు.

**'గోడలు లేచాక' చర్యలేందుకు?**

నిర్మాణాలు పూర్తై స్లాబ్‌లు పడ్డాక నోటీసులు ఇవ్వడం కంటే, పునాది దశలోనే అధికారులు స్పందిస్తే ఇలాంటి అక్రమాలను అడ్డుకోవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముందస్తు పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఆక్రమణలు పెరిగి, అటు కొనుగోలుదారులు, ఇటు సామాన్యులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి కేవలం కాగితాల స్వీకరణకు పరిమితం కాకూడదు. క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాల కూల్చివేత, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నప్పుడే ఈ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది.

# కుప్పానగర్‌లో ఘనంగా భవానీ మాత ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ మే 04 (విజన్ ఆంధ్ర): ఝరాసంగం మండల్ కుప్పానగర్‌లో భవానీ మాత ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా దతగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర మహారాజ్, ధనశ్రీ, మల్లన్నగుట్ట ఆశ్రమాల పీఠాధిపతులు వీరేశ్వర శివాచార్య స్వామి, బసవలింగ అవధూత గిరి అప్పజి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ… తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, భక్తి మార్గాన్ని అలవర్చుకుని జీవితం సార్థకం చేసుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు కుమార్ స్వామి, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకుంటాం: కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి



చేవెళ్ల,మే 04 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో రైతుల పొలాలకు వెళ్లే దారి ఇబ్బందిగా ఉండటంతో సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్నామని కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి తెలిపారు. వాగులో గుమ్ములు వేయించే పనులను సోమవారం వేగంగా చేపట్టించారు. దాంతో రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం రాకపోకలు సాఫీగా కొనసాగుతున్నాయి. స్థానిక రైతులు, గ్రామస్తులు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దళితవాడల అభివృద్ధికి రూ. 15 కోట్ల నిధులు

### -మంత్రి శ్రీధర్ బాబుకు దండు రమేష్ కృతజ్ఞతలు

మల్హర్, మే 04 : మంథని నియోజకవర్గంలోని దళితవాడల సర్వతోముఖాభివృద్ధికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్ కొనియాడారు. సోమవారం మల్హర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సీఆర్ఆర్ ఎస్సీ కంపోనెంట్ కింద నియోజకవర్గంలోని దళితవాడల్లో సి.సి. రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణానికి మంత్రి రూ. 15 కోట్ల భారీ నిధులను మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రికి, దళితుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి శ్రీధర్ బాబు చూపుతున్న చొరవ అభినందనీయమని, రాబోయే రోజుల్లో దళితులంతా కాంగ్రెస్ పార్టీకి, మంత్రికి అండగా ఉంటారని రమేష్ స్పష్టం చేశారు.



# రైతన్న కన్నీరు తుడుస్తాం, నష్టపోయిన గింజకూ పరిహారం ఇస్తాం...

## - కాలిన పంట, గొర్రెలకు న్యాయం చేస్తాం చైర్మన్ రాయల, నూతి, పువ్వాళ్ల హామీ..

## - మీ కష్టం వృథా కానివ్వం, మొక్కజొన్న మొత్తం కొంటాం

## - ఒక్క రైతూ నష్టపోకూడదు అధికారులకు చైర్మన్ రాయల ఆదేశం...

చింతకాని, మే 4 విజన్ ఆంధ్ర.. రైతులు పండించిన ప్రతి మొక్కజొన్న గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ రైతులకు హామీ ఇచ్చారు. మండల పరిధిలో ఆదివారం రాత్రి సుడిగాలితో ఏర్పడిన గాలి దుమారాల వల్ల మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైన మొక్కజొన్న ధాన్యాన్ని, మంటల్లో కాలిపోయిన 30 గొర్రెలను వారు పరిశీలించి నష్టపోయిన రైతులకు అధికారులచే పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని, చనిపోయిన గొర్రెలకు అంచనా వేయించి పరిహారం అందించి వారిని ఆదుకుంటామని తెలిపారు. జిల్లాలో ఎక్కడ గోడౌన్లు ఖాళీగా ఉన్నా అక్కడ ధాన్యాన్ని నిల్వలు చేస్తామని, ఆయా ప్రాంతాల్లో ఉన్న గిడ్డంగుల అధికారులకు రాయల నాగేశ్వరరావు ఫోన్ చేసి ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కజొన్న ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాతర్లపాడు గ్రామంలో మంటల్లో కాలిన మొక్కజొన్న ధాన్యం పంట నష్టం అంచనా వేయడానికి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి ఘటనా స్థలానికి పిలిపించారు. కాలి బూడిదైన మొక్కజొన్న బస్తాలను రైతుల వారీగా అంచనా వేసి రిపోర్ట్ తయారు చేయాలని తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు ఆదేశించారు. అనంతరం కౌలు రైతులకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులకు, సొసైటీ సీఈఓలకు ఆన్‌లైన్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకుని పై అధికారులతో మాట్లాడి కౌలు రైతుల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాలలో మొక్కజొన్న ధాన్యాన్ని పండించిన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక రోజు తేడాతో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి ఎగుమతికి కావలసిన లారీలను కూడా అందుబాటులో ఉంచుతామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 వేల ఎకరాలలో పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని సుమారు 10 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసి తీరుతామని, ప్రతి గ్రామంలో సుమారు 3 వేల ఎకరాలలో 18 వేల క్వింటాళ్ల నిల్వలు ఉన్నాయని, వాటన్నిటినీ ఎగుమతి చేసేందుకు కావలసిన లారీలను తక్షణమే రైతులకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. రైతులు తొందరపడి పంట పొలాలలో ఉన్నటువంటి వ్యర్థాలను కాల్చేందుకు నిప్పు అంటించవద్దని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కర్, చింతకాని మండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండెల నాగార్జున, చింతకాని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్, నాగులవంచ సొసైటీ మాజీ చైర్మన్ శేషగిరిరావు, ఏఈఓ కళ్యాణి, పాతర్లపాడు గ్రామ శాఖ అధ్యక్షులు బొర్రా శేషగిరి రావు, తాళ్లూరి రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు...

# మద్యం మత్తులో వేధింపులు..

## - గొంతు కోసి చంపిన మేనత్త, బావమరిది!

## - జీడిమెట్లలో దారుణం: శవాన్ని మూటకట్టి పారవేస్తుండగా పట్టించిన ఇంటి యజమాని

జీడిమెట్ల మే 4 (విజన్ ఆంధ్ర): నగరంలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నభ్య సమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగుచూసింది. మద్యం మత్తులో నిత్యం వేధిస్తున్నాడన్న కోపంతో, ఓ మహిళ తన మైనర్ కుమారుడితో కలిసి బంధువును పాశవికంగా హత్య చేసింది. హతమార్చడమే కాకుండా, సాక్ష్యాధారాలు దొరక్కుండా మృతదేహాన్ని మూటకట్టి పారవేసేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయారు.

అసలేం జరిగిందంటే..?

పోలీసుల కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా గాలివీడు ప్రాంతానికి చెందిన శివ రెడ్డి, గత పది నెలలుగా చింతల్లోని చెరుకుపల్లి కాలనీలో నివాసముంటున్నాడు. తన బంధువైన గార్లపల్లి అరుణ (44), ఆమె 16 ఏళ్ల కుమారుడితో కలిసి ఒకే అద్దె గదిలో ఉంటున్నాడు. శివ రెడ్డికి మద్యం సేవించే అలవాటు ఉంది. తాగి వచ్చిన ప్రతిసారీ అరుణను, ఆమె కుమారుడిని తీవ్రంగా వేధించేవాడు. ఈ క్రమంలో వీరి మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఆదివారం సాయంత్రం కూడా మద్యం మత్తులో శివ రెడ్డి గొడవకు దిగడంతో, వీరి మధ్య వాగ్వాదం పెరిగి అది కాస్తా హత్యకు దారితీసింది.

గుట్టురట్టు చేసిన ఇంటి యజమాని

అరుణ గదిలో తీవ్రస్థాయిలో అరుపులు, కేకలు వినిపించడంతో పక్క పోర్షన్లలో ఉండేవారు ఇంటి యజమాని కృష్ణకు సమాచారం అందించారు. ఆయన వెంటనే వచ్చి తలుపు తట్టగా, అరుణ ఆమె కుమారుడు భయం భయంగా కనిపించారు. గదిలోకి వెళ్లి పరిశీలించగా..నేలపై ఉన్న రక్తపు మరకలను కడిగేసినట్లు గుర్తించారు. ఒక మూలన ఫ్లోర్ మ్యాట్, సంచులతో చుట్టి తాడుతో కట్టిన భారీ మూట కనిపించింది. అనుమానం వచ్చిన యజమాని ఆ మూటను విప్పి చూడగా, రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్న శివ రెడ్డి మృతదేహం బయటపడింది. నిందితులు పదునైన కత్తితో శివ రెడ్డి మెడపై బలంగా నరికినట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసుల విచారణలో బయటపడ్డ నిజాలు

సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. "నిత్యం తాగి వచ్చి మమ్మల్ని చిత్రహింసలకు గురిచేస్తున్నాడు.. ఆ వేధింపులు భరించలేకే చంపాం" అని నిందితులు పోలీసుల ఎదుట ప్రాథమికంగా ఒప్పుకున్నట్లు సమాచారం.

బాధితుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇంటి యజమాని కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, హత్యానంతరం సాక్ష్యాలను మాయం చేసేందుకు ప్రయత్నించిన కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ నేత ధరావత్ తిరుపతి నాయక్

అక్కన్నపేట మండలం మే04 : హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన్నపేట మండలంలోని దాస్ తండ గ్రామపంచాయతీ పరిధిలో గుగులోత్ రాజేందర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తండ్రి గుగులోత్ రంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గిరిజన నేత ధరావత్ తిరుపతి నాయక్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు

కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచిన ధరావత్ తిరుపతి నాయక్, మానవత్వాన్ని చాటుతూ 50 కిలోల బియ్యం తో పాటు రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగులోత్ పున్నమ్మ



,లకు పతి నాయక్ ,వీరన్న ,రాములు ,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.